




ESTD: 1999

www.voodayam.com

# వుదయం



కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం




కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



వరంగల్ | 14-05-2026 గురువారం | సంపుటి : 11 | సంచిక : 328 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on


*ప్రారంభంలో 118 స్థానాల మెజారిటీ మార్కుకు కాస్త దూరంలో నిలిచిన విజయ్ నేతృత్వంలోని టివికె, ఇప్పుడు తన మద్దతును పటిష్టం చేసుకుని, 22 వ్యతిరేక ఓట్లకు, 5 గైర్హాజరు ఓట్లకు గాను, 144 ఓట్లను అనుకూలంగా సాధించింది. సభలో బలపరీక్షకు ముందు, విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుండి రాజీనామా చేయడంతో, అసెంబ్లీలో టివికె బలం 107 స్థానాలుగా ఉంది. అధికార పక్షం కాంగ్రెస్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్), విసికె, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) (సిపిఎం)లకు చెందిన 13 మంది శాసనసభ్యుల మద్దతుపైనా కూడా ఆధారపడింది.*

**టివికె కూటమికి అనుకూలంగా మారిన సంఖ్యాబలం**




# బలపరీక్షలో విజయం

- టివికె ప్రభుత్వం కొనసాగింపు
- ఎఐఎడిఎంకె రెబెల్స్ మద్దతు
- ఎఐఎడిఎంకెలో క్రాస్-ఓటింగ్
- రాజకీయ వర్గాల్లో కలకలం



**చెన్నై, మే 13 (వుదయం) :** బుధవారం నాడు, సి. జోసెఫ్ విజయ్ తమిళనాడు శాసనసభలో తన మెజారిటీని విజయవంతంగా నిరూపించుకున్నారు. తద్వారా తమిళగ వెట్రి కజగం (టివికె) నేతృత్వంలోని నూతన ప్రభుత్వ స్థానాన్ని ఆయన మరింత పటిష్టం చేశారు. ఈ విశ్వాస తీర్మానం సందర్భంగా, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, విడుతలై చిరుత్తైగల్ కచ్చి (విసికె) వంటి కూటమి భాగస్వాముల నుంచి విజయ్‌కు మద్దతు లభించింది. గవర్నర్ ఎదుట ప్రభుత్వం ఏర్పాటుకు విజయ్ తన హక్కును ప్రకటించిన సమయంలోనూ ఈ పార్టీలన్నీ ఆయనకు అండగా నిలిచాయి. అయితే, ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) మాత్రం శాసన సభ నుండి వాకౌట్ చేయాలని నిర్ణయించుకుంది. తమిళనాడు అసెంబ్లీలో జరగనున్న బలపరీక్షకు ముందు, కూటముల సమీకరణాలు నాటకీయంగా మారిపోయాయి. పిఎంకె ఈ బలపరీక్షకు దూరంగా ఉంటామని సౌమ్య అన్బుమణి ప్రకటించగా, బిజెపిఏ పక్షానికీ మద్దతు ఇవ్వకుండా తటస్థ వైఖరిని అవలంబించింది. వీటికి తోడు, ఎఎంఎంకె ఎమ్మెల్యే కామరాజ్ అసెంబ్లీలోనే విజయ్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. అయితే, ఆయన తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా ఎఎంఎంకె నుండి ఆయనను బహిష్కరించడం జరిగింది.

మిగతా 2లో

# విమానాల కుదింపు

**ఇంధన ధరల పెరుగుదలతో**

**6 విదేశీ మార్గాల్లో సేవలను నిలిపివేయనున్న**

**ఎయిర్ ఇండియా, అంతర్జాతీయ విమానాల తగ్గింపు**




**వుదయం డెస్క్, మే 13 :** పెరుగుతున్న జెట్ ఇంధన ధరలు, కొనసాగుతున్న పశ్చిమ ఆసియా సంఘర్షణ కారణంగా గగనతల ఆంక్షల దృష్ట్యా, ఎయిర్ ఇండియా అంతర్జాతీయ విమాన సర్వీసులను మరోసారి తగ్గిస్తున్నట్లు, ఆరు మార్గాల్లో సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఒక ప్రకటన ప్రకారం, ఈ విమాన యాన సంస్థ ఆగస్టు వరకు ఢిల్లీ-షికాగో, ముంబై-న్యూయార్క్, ఢిల్లీ-షాంఘై, చెన్నై-సింగపూర్, ముంబై-ఢాకా, ఢిల్లీ-మాలే మార్గాల్లో తన సేవలను తాత్కాలికంగా నిలిపివేయనుంది. ఇప్పటికే కొన్ని మార్గాల్లో విమాన సర్వీసులను కుదించిన ఆ విమానయాన సంస్థ, తాజాగా ప్రకటించిన సర్వీసుల క్రమబద్ధీకరణ జూన్-ఆగస్టు కాలంలో అమల్లో ఉంటుందని తెలిపింది. ప్రణాళికలో ఉన్న కొన్ని సర్వీసుల వాణిజ్య సాధ్యాసాధ్యాలపై కొన్ని ప్రాంతాలపై కొనసాగుతున్న గగనతల ఆంక్షలు, అంతర్జాతీయ కార్యకలాపాల నిర్వహణకు రికార్డు స్థాయిలో ఉన్న జెట్ ఇంధన ధరలు వంటి పలు కారణాలు గణనీయంగా ప్రభావం చూపుతున్నాయని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకటన ప్రకారం, ఆ విమానయాన సంస్థ ప్రతి నెలా 1,200కు పైగా అంతర్జాతీయ విమానాలను నడపడాన్ని కొనసాగిస్తుంది. వీటిలో ఉత్తర అమెరికాకు వారానికి 33 విమానాలు, ఐరోపాకు 47 విమానాలు, యుకెకి 57 విమానాలు, ఆస్ట్రేలియాకు 8 విమానాలు, సుదూర ప్రాచ్యం, ఆగ్నేయాసియా, సార్క్ప్రాంతాలకు 158 విమానాలు, అలాగే మారిషస్‌కు వారానికి 7 విమానాలు ఉన్నాయి.

# ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ

**ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్**

**సీఎం తో ఉబెర్ సీఈఓ భేటీ**

**ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్య**

**భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం**

**మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి**

**ఉబెర్ ప్రతినిధులకు సూచించిన సీఎం రేవంత్**



**హైదరాబాద్, మే 13 (వుదయం ప్రతినిధి) :** ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం సీఎం రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ లో నివాసం లోని ఆయన నివాసంలో భేటీ అయింది. ఈ సందర్భంగా దారా ఖోస్రోషాహి.. ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. కాగా, దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదన్నారు. దీంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు.

మిగతా 2లో

# భగీరథ్‌పై భగభగలు

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఎదుర్కొంటున్న లైంగిక ఆరోపణపై నేతల ఫైర్



## కీలక ఆధారాలతో వస్తా..

**సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో**

**సహకరిస్తాను : పోలీసులకు బండి భగీరథ్ లేఖ**

**మే 15న విచారణకు హాజరవుతా**

**హైదరాబాద్, మే 13 (వుదయం ప్రతినిధి) :** పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం నాడు మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని లేఖలో పేర్కొన్నారు. సిట్ అధికారులకు ఈమెయిల్, అధికారిక లేఖను బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని

మిగతా 2లో

**బండి భగీరథ్ ను తప్పించే అవసరం లేదు**

**ఆ కేసులో ఎలాంటి జాప్యం లేదు**

**చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవు**

**బాధితురాలికి న్యాయం జరిగే వరకు వెనుకంజ వేయం**

**కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయి**

**ఎస్ ఐ ఆర్ తో తెలంగాణలోనూ అక్రమాలు చేయాలని**

**బీజేపీ చూస్తోంది : టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్, మే 13 (వుదయం ప్రతినిధి) :** మైనర్ బాలికపై లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటోన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు ఏ మాత్రం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని చెప్పారు. బుధవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు.

మిగతా 2లో

**బండి సంజయ్ కుమారుడిపై లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలి**

**విదేశాలకు పారిపోకుండా చర్యలు చేపట్టాలి • బాధితురాలికి న్యాయం చేయాలి**

**పాలమూరు-రంగారెడ్డి జాతీయ హోదాపై ప్రధాని నోటి వెంట ఒక్క మాట రాలేదు**

**సీఎం రేవంత్ రెడ్డి అడగలేదు.. బీఆర్ఎస్ ప్రశ్నించలేదు.. ప్రతి గుంటకు నీళ్లిస్తాం**

**ప్రధాని ఆంధ్రాకు పైసలు ప్రకటించి... మనకు పొదుపు సూత్రాలు చెప్పిండు**

**నీళ్ల కోసమే ఏర్పడిన తెలంగాణలో మన వాటాను వాడుకోలేని దుస్థితిలో ఉన్నాం**

**మమ్మల్ని ప్రజలు ఆశీర్వదిస్తారు.. అధికారంలోకి వచ్చాక వాటర్**

**కమిషన్ ఏర్పాటు చేస్తాం : మీడియాతో టీఆర్ఎస్ చీఫ్ కవిత**



**హైదరాబాద్, మే 13 (వుదయం ప్రతినిధి) :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు పారిపోకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై గంభీరమైన ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయన ప్రధానితో వేదిక పంచుకోవటం శోచనీయమని అన్నారు. కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు బండి సంజయ్ ఆ మీటింగ్‌కు వెళ్లాల్సింది కాదన్నారు. బడాబాబుల పిల్లలు

మిగతా 2లో



## ఇంటర్ పరీక్ష రాసిన మావోయిస్టు మాజీ అగ్రనేత

**ఈ ఫిబ్రవరిలోనే మావోయిస్టు ఉద్యమాన్ని**

**వీడి జనజీవన స్రవంతిలో కలిసిన దేవ్ జీ**

**కోరుట్ల, మే 13 (వుదయం ప్రతినిధి) :** మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఇంటర్ పరీక్షకు హాజరయ్యారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆయన ఈ పరీక్ష రాశారు. 1980-82లో దేవ్‌జీ కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివారు. విద్యార్థి రాడికల్ యూనియన్‌లో పనిచేస్తున్న సమయంలో సెకండియర్ తెలుగు పరీక్షను ఆయన బహిష్కరించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసిన ఆయన.. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో పరీక్ష రాశారు. బుధవారం కోరుట్లలోని మ్యాస్ట్రో జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్ష రాశారు. న్యాయవాద కోర్సు చేసి పేదల కోసం పనిచేస్తానని దేవ్‌జీ చెప్పారు.

## లిఫ్ట్‌లో చిక్కుకుని ఐదేళ్ల చిన్నారి మృతి

**గచ్చిబౌలి పీఎస్ పరిధి గౌలిదొడ్డిలో విషాదం**

**లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన చిన్నారి జుట్టు**

**హైదరాబాద్, మే 13 (ఎంఎస్) :** నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధి గౌలిదొడ్డిలో తీరని విషాదం చోటుచేసుకుంది. లిఫ్ట్‌లో చిక్కుకుని ఓ ఐదేళ్ల చిన్నారి మృతిచెందింది. ఓ మహిళా హాస్టల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతిచెందిన చిన్నారిని పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిస్తు ఘోష్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దంపతులు మహిళా హాస్టల్‌లో వంట పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వారికి ఐదేళ్ల చిన్నారి బిస్తు ఘోష్ ఉంది. బుధవారం మధ్యాహ్నం గ్రిల్ లిఫ్ట్‌లో అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్ నుంచి 5వ ఫ్లోర్‌కు బాలిక వెళ్లింది. ఈ క్రమంలో 3వ ఫ్లోర్‌లో చిన్నారి జుట్టు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయింది. దీంతో తల మొత్తం నుజ్జునుజ్జయి బిస్తు ఘోష్ మృతిచెందింది. గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. హైడ్రా, ఫైర్ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అభివృద్ధిలో అంతా సమానమే

## అమరావతే కాదు.. విశాఖనూ విశ్వనగరం చేస్తున్నాం



- రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం
- కిమ్స్ ఆసుపత్రి, వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి భూమి పూజ
- తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు
- లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం
- వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు : సీఎం చంద్రబాబు
- లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే ప్రభుత్వ ఆలోచన
- ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి
- రాబోయే రోజుల్లో ప్రభుత్వంలోనూ వర్క్‌ఫ్రమ్ హోమ్

**అమరావతి, మే 13 (వుదయం ప్రతినిధి) :** అభివృద్ధిలో నాకు అంతా సమానమేనని ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ విషయంలో ఒక్క అమరావతి పైనే శ్రద్ధ పెట్టట్లేదని.. విశాఖనూ విశ్వనగరంగా చేస్తున్నామని రాజధాని ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి, వైద్య విశ్వవిద్యాలయం నిర్మాణానికి బుధవారం సీఎం చంద్రబాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తున్నాం. ఆ ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ఏరో స్పేస్ హబ్‌గా అనంతపురం మారబోతోంది. రాయలసీమ 'టెక్నాలజీ హబ్'గా తయారవుతోంది. తిరుపతిలో ఏరో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతున్నాయి. శ్రీసిటీ, ఇండస్ట్రియల్ హబ్‌గా తయారైంది. భాస్కర్‌రావు ఒక విజన్ ఇచ్చారు. 2027 మే 13న కిమ్స్ ఆసుపత్రిని ప్రారంభిస్తాం. 2028 ఆగస్టు 15 కంటే ముందే విశాఖలో గూగుల్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. 2028 డిసెంబరులోపు ఫేజ్-1 పూర్తి చేయాలని ఆర్సెల్లార్ మిత్తల్‌కు ఆదేశాలు ఇచ్చాం. ఎలాంటి అనుమతులు కావాలన్నా త్వరగా ఇస్తాం. లక్ష మందికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తాం.

మిగతా 2లో

## మోడీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోంది

**ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోక**

**పోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాశారు**

**అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్**

**స్టాంప్ అనేది మోడీ భావన: వీహెచ్**



**హైదరాబాద్, మే 13 (వుదయం ప్రతినిధి) :** అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని ప్రధాని మోదీ భావిస్తున్నారని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు మండిపడ్డారు. సీబీఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడారు. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారన్నారు.

మిగతా 2లో

## నీట్ లీక్ కేసులో మూడవ అనుమానితురాలి అరెస్టు

**నిందితుడు శుభమ్ ఖైర్నారేను కోర్టులో హాజరు పరిచిన సిబిఐ**

**ఓ భారీ ముఠా ప్రమేయం : దర్యాప్తు సంస్థల అనుమానం**



5

## ఇంధన వినియోగం మోడీ కాన్వాయ్ కుదింపు

**ఈవీల వినియోగానికి ప్రోత్సాహం**

**కాన్వాయ్‌లో విద్యుత్ వాహనాలను చేర్చాలి**

**అధికారులకు మోడీ ఆదేశాలు**



## చమురు ధరలు పెరిగే అవకాశం?

**ఇరాన్ యుద్ధం కొనసాగి, చమురు ధర**

**బ్యారెల్‌కు 100 డాలర్లు దాటితే**

**పెట్రోల్, డీజిల్ ధరలు త్వరలోనే పెరిగే అవకాశం :**

**హెచ్చరించిన ఆర్‌బిఐ గవర్నర్**



5

# భగీరథ్‌పై భగభగలు

మొదటి పేజీ తరువాయి

## బండి భగీరథ్ ను తప్పించే అవసరం లేదు

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని చెప్పారు. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను పోలీసులు తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తాము నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మి కి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ఎస్ ఐ ఆర్ తో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. దేశంలో కమ్యూనిస్టుల ప్రాభవం తగ్గిందని భావించడం పొరపాటేనని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు, వారు ఇప్పటికీ సజీవంగానే ఉన్నారని వ్యాఖ్యానించారు. మారుతున్న రాజకీయ సమీకరణాల్లో కమ్యూనిస్ట్ భావజాలం ప్రాముఖ్యత దేశానికి ఎంతో అవసరమన్న ఆయన వారి ఉనికిని తక్కువ అంచనా వేయవద్దని పేర్కొన్నారు. దేశంలో కమ్యూనిజం కనుమరుగైందని అనుకోవడం ఒక అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు, క్షేత్రస్థాయిలో వారు ఇప్పటికీ బలంగానే ఉన్నారని తేల్చి చెప్పారు. మరోవైపు 'ప్రజలు ప్రతిపక్ష పాత్ర కేసీఆర్‌కు ఇచ్చారు.. కానీ ఆయన ఫామ్ హౌజ్‌కు పరిమితం అయ్యారు. అయినా మేము ప్రతిపక్ష నేతను గౌరవిస్తున్నాము. కేసీఆర్ లాగా బిహేవ్ చేయము. ఆనాడు దళితుడు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఉంటే కేసీఆర్ ఓర్చుకోలేక పోయారు. మా ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ వీక్‌గా ఉందన్న విషయం మోడీకి అర్థం అయ్యింది. అందుకే తెలంగాణకు వచ్చినట్టు మాకు అర్థం అవుతుంది' అని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు.

## కీలక ఆధారాలతో వస్తా..

మొదటి పేజీ తరువాయి



ఆయన స్పష్టం చేశారు. సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మే 15వ తేదీన జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది.

## బండి సంజయ్ కుమారుడిపై లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలి

### మీడియాతో టీఆర్ఎస్ చీఫ్ కవిత

ఏం చేసిన సరే పోలీసులు చర్యలు తీసుకోరన్న అభిప్రాయం ప్రధాని సభతో ప్రజల్లోకి వెళ్లిందన్నారు. నిందితులను దేశం దాటించే అలవాటు బీజేపీకి ఉందని గుర్తు చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ కేసులో అది నిరూపితమైందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటిపోకుండా లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

కొందరు ట్వీట్స్ చేస్తూ సమస్యను పరిష్కరించినట్లు బిల్డప్ ఇస్తున్నారని.. అలాంటి పార్టీ వాళ్లు తానేందుకు స్పందించలేదని అడ్డగోలుగా కామెంట్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఆడపిల్ల విషయం, అందులోనూ మైనర్ విషయంలో స్పందించే ముందు సంయమనం పాటించాలన్నారు. ఈ సమాజం మగపిల్లలను క్షమించినట్లుగా ఆడపిల్లలను క్షమించదని చెప్పారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహం కారణంగా బాధిత అమ్మాయి ఫొటోలు బయటకు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఫోటోలు బయటకు వస్తే వాళ్ల జీవితం నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఫోటోలు పోస్ట్ చేసిన సోషల్ మీడియా ఎకౌంట్లను గుర్తించి వాళ్లను అరెస్ట్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. రాజకీయాల్లోని లేని బండి సంజయ్ కుమారుడి విషయంలో రాజకీయాలను చేయటం తనకు ఇష్టం లేదని బాధితురాలికి న్యాయం జరగాలన్నదే తన అభిమతమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు మరోసారి మొండి చెయ్యి చూపించారని చేశారు. తెలంగాణ పర్యటనలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఇస్తారని భావించిన మనకు పొదుపు సూత్రాలు చెప్పి... ఆంధ్రాకు పైసలు ఇచ్చి వెళ్లిపోయారని మండిపడ్డారు. పాలమూరు ప్రాజెక్ట్ జాతీయ హోదా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జాతీయ హోదా గురించి ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందని కవిత ప్రశ్నించారు. ప్రధాని పర్యటనలో తెలంగాణకు ఏం ఇవ్వకపోయినా ప్రధాన ప్రతిపక్షం ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు.

**తెలంగాణపై మళ్లీ అదే వివక్ష**

తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ మరోసారి రాష్ట్రం పై వివక్ష చూపారని కవిత అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా సహా మహిళ బిల్లు, జన గణనలో కుల గణన గురించి మాట్లాడతారని భావించినప్పటికీ వాటి గురించి ఒక్క మాట మాట్లాడలేదన్నారు. దేశంలో 16 రాష్ట్రాల్లో ప్రాజెక్ట్ లకు జాతీయ హోదా ఇచ్చి తెలంగాణకు ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నించారు.పాలమూరు-రంగారెడ్డి కి జాతీయ హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. దీనిపై తాము పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. అదే విధంగా బీసీ రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లులకు ఆమోదం తెలుపాలని మరోసారి డిమాండ్ చేశారు. జనగణనలో కుల గణన కాలంతో పాటు సబ్ క్యాస్ట్, ప్రజల సామాజిక స్థితిగతులు తెలుసుకునేలా వివరాలు పొందుపర్చాలని కేంద్రాన్ని కవిత కోరారు. మహిళ బిల్లులో ఓబీసీ మహిళల సబ్ కోటా ఉండాల్సిందేన్నారు.

**మీ గురువును చూసి నేర్చుకో**

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ కవిత మండిపడ్డారు. నీళ్ల విషయంలో మనకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి కి జాతీయ హోదా కోసం ప్రధాని మోడీకి లేఖ రాయాలని రేవంత్ ను కోరారు. ఒక వైపు పోలవరం పూర్తి చేసేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేస్తుంటే...రేవంత్ రెడ్డి మాత్రం పాలమూరు ప్రాజెక్ట్ ను ఎందుకు పట్టించుకోవటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటి వరకు కూడా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో ఒక్క రివ్యూ కూడా చేయలేదని కవిత విమర్శించారు. మాట్లాడితే నల్లమల్ల బిడ్డను అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు- రంగారెడ్డి విషయంలో చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్న మీ గురువు చంద్రబాబు నాయుడిని చూసైన నేర్చుకో అంటూ రేవంత్ కు సూచించారు. పాలమూరు -రంగారెడ్డి లాంటి పరిస్థితే ఉన్న అప్పర్ భద్రకు కూడా జాతీయ హోదా ఇచ్చారని కవిత గుర్తు చేశారు. కేంద్రం పై ఒత్తిడి పెంచి జాతీయ హోదా వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రధాని మోడీ తెలంగాణకు వచ్చిన సందర్భంలో జాతీయ హోదా గురించి బీఆర్ఎస్ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

**సాగు యోగ్యమయ్యే ప్రతి గుంట భూమికి నీళ్లిస్తాం**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీళ్ల కోసమని కవిత చెప్పారు. కానీ ఇప్పటికి కూడా మనం గోదావరి లో మన వాటాలో పావు శాతం, కృష్ణాలో అరశాతం కూడా వాడుకోవటం లేదని చెప్పారు. ఆంధ్రాలో మాత్రం వాళ్ల వాటాకు మించి నీళ్లు వాడుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారన్నారు. వారితో పోల్చుకుంటే మనం ఎంతో వెనుకబడి ఉన్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1.89 లక్షల కోట్లు ఖర్చు కాగా ఇప్పుడు కాంగ్రెస్ కూడా పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేస్తుందని కానీ నీళ్లు మాత్రం వాడుకునే సిస్టమ్ చేయలేకపోయారని మండిపడ్డారు. తాము అధికారం లోకి వచ్చాక తెలంగాణ లో సాగు యోగ్యమైన ప్రతి గుంటకు నీళ్లు ఇస్తామని కవిత చెప్పారు. ఇందుకోసం వాటర్ కమిషన్ ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మూడు వేల ఎకరాలకు ఒక లష్కర్ ను నియమిస్తామని చెప్పారు. తెలంగాణలో ఉన్న అన్ని నదులపై వందేళ్లు పటిష్టంగా ఉండేలా గేట్లతో కూడిన చెక్ డ్యామ్ లు కడుతామన్నారు.

**జెండా పండుగ పార్టీ నిర్మాణానికి పునాది**

ఈ నెల 20 నుంచి చేపట్టబోయే జెండా పండుగ పార్టీ నిర్మాణానికి పునాది అని కవిత అన్నారు. పలు నియోజకవర్గాల్లో జెండా పండుగకు తాను హాజరవుతానని చెప్పారు. జెండా పండుగ నిర్వహణ ఆధారంగా పదవులు ఇస్తామని చెప్పారు. బీసీలకు చట్టసభలు, విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం కొట్లాడుతామని చెప్పారు. అన్ని రాష్ట్రాలు తిరిగి ఈ అంశంపై తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఇక నీట్ పేపర్ లీక్ అయి పరీక్ష రద్దు చేయటంపై కవిత మండిపడ్డారు. రూ. పది డైపర్ కూడా లీక్ కావటం లేదని, అలాంటి నీట్ పేపర్ ఎలా లీక్ అవుతుందని ప్రశ్నించారు. దేశ భవిష్యత్ అయిన విద్యార్థులను ఇబ్బంది పెట్టేలా కేంద్రం చర్యలు ఉన్నాయని విమర్శించారు. ఇంత టెక్నాలజీ వచ్చిన తర్వాత కూడా పేపర్ లీక్ కాకుండా చర్యలు తీసుకోలేరా అని ప్రశ్నించారు.

**రైల్వే కోర్టుకు హాజరైన కవిత**... నాంపల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో రైల్ రోకో చేసిన కేసులో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం రైల్వే కోర్టుకు హాజరయ్యారు. నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్ లో గల సికింద్రాబాద్ సెకండ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు మేజిస్ట్రేట్ సమన్లు జారీ చేయడంతో వ్యక్తిగతంగా హాజరయ్యారు. కేసు తదుపరి విచారణ జూలై 17న నిర్వహిస్తామని మేజిస్ట్రేట్ ప్రకటించారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 2025 నవంబర్ 28న కామారెడ్డిలో టీఆర్ఎస్ నాయకులు రైల్ రోకో చేశారు. ఈ ఆందోళనపై రైల్వే పోలీసులు కల్వకుంట్ల కవితతో పాటు 12 మందిపై కేసు నమోదు చేశారు. మనోరంజన్ రైల్వే కోర్టు విచారణ అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కేసులకు, విచారణలకు భయపడేది లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అవసరమైతే నిరవధిక రైల్ రోకో చేసేందుకు కూడా సిద్ధమని తేల్చి చెప్పారు



# హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది. హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని సీఎం తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు.ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు.ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోంది

మొదటి పేజీ తరువాయి

సీబీఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని తెలిపారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోకపోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధానికి రాహుల్ లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తారా అని వీహెచ్ ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ.. పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు.

## అభివృద్ధిలో అంతా సమానమే

మొదటి పేజీ తరువాయి

వైద్యులు కూడా ఏఐని నేర్చుకుంటున్నారు. లక్ష మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేదే మా ప్రభుత్వ ఆలోచన. ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుంది. విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతి పొలంలో, ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ లాంటి విద్యుదుత్పత్తి కేంద్రాలు తీసుకొస్తాం. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. భవిష్యత్తులో వర్క్‌ఫ్రమ్ హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. 10 కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది.. సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. హాలిడే వస్తే విదేశాలకు వెళ్తున్నారు. మంచి పర్యాటక ప్రదేశాలు మన దేశంలోనే ఉన్నాయి. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్య లంక మారుతుంది.'' అని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో



**మే 13, మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి :** నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో రాజిరెడ్డి సందర్శించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కాంటలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కాంటలు వేసిన బస్తాలను త్వరితగతిన లారీలలో రైస్ మిల్లులకు తరలించాలని ఏవైనా ఇబ్బందులు కలిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, కార్యదర్శి చంద్రహాస్, లు ఉన్నారు.

# బలపరీక్షలో విజయం

**ఎఐఎడిఎంకెలో క్రాస్-ఓటింగ్: రాజకీయ వర్గాల్లో కలకలం**

విశ్వాస తీర్మానానికి సంబంధించి, పార్టీకి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసినట్లు వార్తలు రావడంతో, ఇది ఎడప్పాడి కె. పళనిస్వామికి, ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకె) పార్టీకి రాజకీయంగా అత్యంత కీలకమైన ఘట్టంగా మారింది. ఈ అనూహ్యమైన క్రాస్-ఓటింగ్ వ్యవహారం, ఎఐఎడిఎంకె శ్రేణుల్లో అంతర్గత చీలికలు ఏర్పడి ఉండవచ్చనే ఊహాగానాలకు తెరలేపింది. రాబోయే రోజుల్లో ప్రతిపక్ష కూటమిలో అంతర్గత చర్చలను ఇది మరింత ముమ్మరం చేసే అవకాశం ఉంది. ఉదయం 9:30 గంటలకు సభా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. శాసనసభ్యులు వరుసగా అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. తమిళనాడు రాజకీయ చరిత్రలోనే తొలిసారిగా, ఈ బలపరీక్ష ప్రక్రియ మొత్తం ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా ప్రజల విస్తృత దృష్టిని ఆకర్షించింది. బయటి నుండి మద్దతు లభిస్తున్నప్పటికీ, టివికె ఎమ్మెల్యే శ్రీనివాస సేతుపతిని ఓటింగ్‌లో పాల్గొనకుండా నిలువరించడంతో ప్రభుత్వం ఒక ఎదురుదెబ్బను ఎదుర్కొంది.

**ఎమ్మెల్యే ఓటు హక్కు నిషేధంపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు**

తిరుపత్తూరు నియోజకవర్గం నుండి కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించిన శ్రీనివాస సేతుపతిని, మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు సభా విశ్వాస పరీక్షలో పాల్గొనకుండా నిలువరించారు. విశ్వాస తీర్మానం సందర్భంగా తుది సంఖ్యాబలంపై అధికార కూటమిలో ఈ తీర్పు స్వల్పకాలిక ఆందోళనలకు దారితీసింది. హైకోర్టు ఆదేశానికి వ్యతిరేకంగా అత్యవసర విచారణ కోరుతూ సేతుపతి ఇప్పుడు భారత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనను ఓటు వేయకుండా అడ్డుకోవడం, తిరుపత్తూరు ఓటర్లు ఇచ్చిన తీర్పును బలహీనపరుస్తుందని ఆయన తన పిటిషన్‌లో వాదించారు.

# అప్రమత్తంగా ఉండండి

**రాష్ట్రం లో కొన్ని జిల్లాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం.**

**అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు రావొద్దు**

**ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలి**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, మే 13 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. రానున్న ఆరు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్ర వడగాలులు, 44 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి బుధవారం ఆదేశించారు.ఒకవైపు భగ్గుమంటున్న ఎండలు, మరోవైపు ఈదురు గాలులు, ఉరుములు-మెరుపులతో కూడిన అకాల వర్షాలు సంభవించే పరిస్థితులు ఉన్నందున ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, తదుపరి రోజుల్లో జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా ఎండల తీవ్రత పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని, ఎండలో పనిచేసే వారు తలకు రక్షణ కల్పించే వస్త్రాలు ధరించాలని సూచించారు.వడదెబ్బలు, ఎండ తీవ్రత కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వడదెబ్బ నివారణ చర్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.రైతులు, కూలీలు, నిర్మాణ కార్మికులు, రహదారులపై పనిచేసే కార్మికులు ఎండ తీవ్రత సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మంత్రి సూచించారు. ఈదురు గాలులు, ఉరుములు-మెరుపులు సంభవించే ప్రాంతాల్లో ప్రజలు చెట్ల కింద నిలబడకుండా, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు రండి

**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి**

**ఆహ్వానించిన దేవాదాయ అధికారులు**



**హైదరాబాద్, మే 13 (వుదయం ప్రతినిధి) :** ఈనెల 21 నుండి ప్రారంభమయ్యే సరస్వతి అంత్య పుష్కరాలకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానం అందింది. బుధవారం దేవాదాయ శాఖ అధికారులు,అర్చకులు మంత్రుల నివాస సముదాయంలోనీ మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంత రావు,అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ శాలువా కప్పి ఆహ్వాన పత్రిక అందజేశారు. గత ఏడాది సరస్వతి పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరైన నేపథ్యంలో...గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరస్వతి అంత్య పుష్కరాలకు రోడ్లు భవనాలు శాఖ తరుపున అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు..ఆర్ అండ్ బి శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పుష్కరాలను విజయవంతం చేయాలని సూచించారు. రాబోయే గోదావరి పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భక్తుల కోసం ఏర్పాట్లు ప్రారంభించిందని,రోడ్లు భవనాలు శాఖ అధ్వర్యంలో పుష్కర ఘాట్ల నిర్మాణం,రోడ్ కనెక్టివిటీ లాంటి భక్తుల సౌకర్యాలపై ప్రధాన దృష్టి సారించినట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి మంత్రులకు వినతులు

**9వ వార్డు సమస్యల పరిష్కారానికి మంత్రులను కలిసిన కౌన్సిలర్ వనం రమేష్**



**సిద్దిపేట, మే 13( వుదయం ):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ 9వ వార్డులో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి వార్డు కౌన్సిలర్ వనం రమేష్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం లో రాష్ట్ర మంత్రులను కలిసి వార్డు సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు.9వ వార్డులో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల అభివృద్ధి వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన మంత్రులను కోరినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని వనం రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వారి వెంట మాజీ కౌన్సిలర్ బాలకృష్ణ, వనం అశోక్ ఉన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై
# పకడ్బందీ నిఘా

**బక్రీద్ పండుగపై అప్రమత్తంగా ఉండాలి**

**రెండువర్గాల మధ్య ఘర్షణలు**

**తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి**

**పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలకు డీజీపీ**

**సీవీ ఆనంద్ దిశానిర్దేశం**



**హైదరాబాద్, మే 13 (వుదయం ప్రతినిధి) :** ఈ నెల 18న బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు బుధవారం హైదరాబాద్ లోని తన కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైందన్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండువర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని డీజీపీ సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పశువుల సంతలపై ప్రత్యేక నిఘా**.. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు.

**అలా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు**.. శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండువర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని మార్గనిర్దేశం చేశారు.

**అధికారులు సమన్వయంతో వ్యవహరించాలి**.. పోలీస్, మున్సిపల్, పశుసంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. సీజ్ చేసిన పశువులను సంరక్షించేందుకు తగిన విస్తీర్ణంలో క్యాటిల్ పాండ్‌లను ఏర్పాటు చేయాలని, అక్కడ పశువులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు పెట్టే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

**అధికారులు అప్రమత్తతో ఉన్నారు: జయేశ్ రంజన్**

మున్సిపల్ అధికారులు బక్రీద్ పండుగ నేపథ్యంలో అప్రమత్తతో ఉన్నారని స్పెషల్ సీఎస్ (ఎంఏయూడీ) జయేశ్ రంజన్ తెలిపారు. కౌ స్లాటర్ యాక్ట్, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ చట్టాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. అలాగే, పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కె. ఇలంబర్తి మాట్లాడారు. పశువుల రవాణాకు సంబంధించిన సర్టిఫికెట్లను ఇచ్చేందుకు వెటర్నరీ డాక్టర్లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో వెటర్నరీ డాక్టర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపీ, శాంతిభద్రతల డీజీపీ మహేశ్ ఎం భగవత్, ఐజీపీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, కార్తికేయ, ఇంటెలిజెన్స్ డీఐజీ భాస్కరన్ తదితరులు తగు సూచనలు చేశారు.



"* బ్రిక్స్ ప్రకటనకి మేం అనుకూలంగా ఉన్నాము. భారతదేశం ఆతిథ్యం ఇస్తున్న బ్రిక్స్ విజయవంతం కావాలని కోరుకుంటున్నాము. బ్రిక్స్ చీలిపోయిందనే సందేశాన్ని మేము ఇవ్వదలచుకోలేదు. ఇరాన్ తన పొరుగు దేశాలపై దాడి చేస్తోందని, ఖండించాలని, ఒక పొరుగు దేశం తెగ ఒత్తిడి చేస్తోంది. మేం పొరుగు దేశాలపై దాడి చేయలేదు. వారు తమ భూభాగాలను అమెరికాకు అప్పగించారు. అక్కడి నుం,ఇ ఇరాన్‌పై వేల సార్లు దాడులు జరిగాయి. మేం ప్రతి దాడిని 500 పేజీలలో నమోదు చేసి ఐక్యరాజ్యసమితికి సమర్పించాం. మేము దీనిని అంగీకరించలేం.

* ఇరాన్ విదేశాంగ శాఖ న్యాయ, అంతర్జాతీయ వ్యవహారాల ఉప మంత్రి కాజెమ్ ఘరీబాబాది"

## వేమన పద్యం

పాలు పంచదార పాపర పండ్లలో
జాలబోసి వండ చవికి రాదు
కుటిన మానవులకు గుణమేల గల్గురా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# జేబు జాగ్రత్తలు

పశ్చిమాసియా లోనూ, ప్రపంచం లోనూ కొనసాగుతున్న సంఘర్షణలు భౌగోళిక రాజకీయ పోరలను బహిర్గతం చేశాయి. తమ ప్రజల అవసరాలకు పరిష్కారాలు, ప్రత్యామ్నాయాలు కనుగొనడానికి దేశాలు తహతహలాడుతూ, ఇంధన కారిడార్లు, భవిష్యత్ సాంకేతికతలపై ఆధిపత్యాన్ని దక్కించుకోవడానికి పోటీ పడుతున్నాయి. కాగా, రాష్ట్రాల ఎన్నికల దుమారం సద్దుమణగుతున్న తరుణంలోనే, ప్రధానమంత్రి మోడీ పొదుపుకు పిలుపునిస్తూ, పౌరులను తక్కువ ఇంధనం వాడాలని, తక్కువ బంగారం కొనాలని, విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవాలని ఉద్బోధించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రధాని మోడీ వలె తమ ప్రజల సమస్యలను ఇంత సూటిగా ప్రస్తావించే నాయకులు చాలా తక్కువ. ఆదివారం నాటి తన ప్రసంగంలో, ఇంధనం, వంట నూనెలు, బంగారం పొదుపుగా వాడుకోమంటూ సలహా ఇవ్వడంతో దేశం ఒక్కసారిగా భయాందోళనలకు లోనైంది.కాగా, మోడీ చేసిన మూడు అభ్యర్థనలలో ప్రతి ఒక్కటి, దేశ దిగుమతుల జాబితాలోని నిర్దిష్ట అంశాలతో ముడిపడి ఉంది. చమురు అత్యంత ఆందోళన కలిగించే అంశం. ముడి చమురు, పెట్రోలియం దిగుమతులపై భారతదేశం ఏటా వందల బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తోంది, ఇది దాని మొత్తం దిగుమతుల బిల్లులో సుమారు 22 శాతంగా ఉంది. పౌరులను ఇంటి నుంచే పని చేయమని, కార్‌పూల్ చేసుకోమని, ప్రజా రవాణాను ఉపయోగించమని ప్రోత్సహించడం ద్వారా మోడీ ఈ మహమ్మారిని ఆదర్శంగా భావించడం లేదు. దానికి బదులుగా, ద్రవ్య విధానం త్వరితగతిన సాధించలేని చర్యలను చేపట్టాలని ఆయన పౌరులను కోరుతున్నారు. రూపాయిపై ఒత్తిడిని, వాణిజ్య లోటును తగ్గించడానికి, గృహ స్థాయిలో పెట్రోలియం డిమాండ్‌ను నామమాత్రంగానైనా తగ్గించాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలకు ఆందోళన కలిగించిన రెండవ అంశం బంగారం. భారతీయుల జీవనంలో బంగారం ఒక ప్రధాన పాత్రని పోషిస్తుంది. పెళ్లి నుంచి పెట్టుబడిదాకా బంగారం లేకుండా జరుగదు. కానీ, ఏప్రిల్‌లో, భారతదేశపు బంగారు దిగుమతులు 24 శాతం పెరిగి, గత ఏడాది 58 బిలియన్ డాలర్ల నుండి 71.98 బిలియన్ డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. భారతదేశం తన బంగారు అవసరాలలో దాదాపు 85 శాతాన్ని దిగుమతి చేసుకుంటుంది. అంటే, ప్రపంచంలోనే బంగారంపై అత్యధికంగా ఆధారపడిన దేశాలలో ఒకటిగా నిలుస్తోంది. దిగుమతి చేసుకున్న బంగారంపై ఖర్చు చేసే ప్రతి రూపాయి, దేశీయ ఆర్థిక వ్యవస్థ నుండి బయటకు వెళ్తున్నట్లే. ఇది కరెంట్ ఖాతాపై ఒత్తిడిని పెంచుతోంది. చమురు దిగుమతుల వల్ల కరెంట్ ఖాతా లోటు ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్న తరుణంలో, మోడీ చేసిన అభ్యర్థన వివేకవంతమైనదనవలసిందే. బంగారాన్ని శాశ్వతంగా వదులుకోవద్దని, ఆర్థిక పరిస్థితి స్థిరపడే వరకు ఒక సంవత్సరం పాటు దాని కొనుగోలును తాత్కాలికంగా నిలిపివేయాలని ఆయన కోరారు. ఆర్థిక ప్రవాహంలో మూడవ రంగం విదేశీ పర్యాటకం. భారతీయులు వినోదం కోసం విదేశాలకు వెళ్ళినప్పుడు, వారు డాలర్లు, యూరోలు, దిర్హమ్‌ల వంటి విదేశీ కరెన్సీలను ఖర్చు చేస్తారు. సమిష్టిగా, ఈ ప్రవాహం కరెంట్ ఖాతాపై ఒత్తిళ్లను మరింత తీవ్రతరం చేస్తుంది. మోడీ విజ్ఞప్తి కాలపరిమితితో కూడుకున్నది, నిర్దిష్టమైనది. ఇది జీవనశైలి ఎంపికలపై విమర్శగా కాకుండా, ఒక ఆర్థిక రక్షణ కవచంగా పనిచేస్తుంది. అందుకే ప్రజలు, దీనిని ఆందోళన కలిగించే విషయంగా భావించకూడదు. రూపాయిని కాపాడటానికి, దిగుమతులకు నిధులు సమకూర్చడానికి రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న డాలర్లు, బంగారం, ఇతర ఆస్తులతో కూడిన భారతదేశ విదేశీ మారక నిల్వలు గణనీయమైన భరోసాను అందిస్తున్నాయి. ప్రవాస భారతీయుల నుండి వచ్చే రెమిటెన్సులు ఈ భరోసాను మరింత బలోపేతం చేస్తున్నాయి, ప్రభుత్వం హొర్ముజ్ జలసంధిపై ఆధారపడిన మార్గాల నుండి ముడి చమురు సేకరణను చురుకుగా వైవిధ్యపరిచింది. సంస్థాగత వ్యవస్థలు పటిష్ఠంగానే ఉన్నాయి. రెండవదిగా, ప్రధానమంత్రి సందేశం రాబోయే విధానపరమైన చర్చలలో ఒక ప్రాథమిక దశను సూచిస్తుందని గుర్తించడం ముఖ్యం. దిగుమతి సుంకాలలో మార్పులు, ఇంధన ధరల పునఃసమీకరణలు, దేశీయ ప్రత్యామ్నాయాలకు ప్రోత్సాహకాలు వంటి మరింత కఠినమైన చర్యలు తదనంతరం రావచ్చు.ముఖ్యమైన విషయం ఏమిటంటే, వ్యక్తులు తమ సొంత ఆర్థిక పరిస్థితులను అంచనా వేసుకోవాలి. దేశీయంగా బంగారం ధరలు అత్యధిక స్థాయికి చేరుకున్నాయి, 2026 ప్రారంభంలో 10 గ్రాముల బంగారం సగటున రూ. 1,50,000 పైగా ఉంది. ఇది కొత్త కొనుగోళ్లకు అత్యంత హేతుబద్ధమైన ప్రవేశ బిందువు కాకపోవచ్చు. భౌతిక దిగుమతి అవసరం లేకుండా బంగారం ధరను ట్రాక్ చేసే ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్ అయిన సావరిన్ గోల్డ్ బాండ్స్, గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా తక్కువ విదేశీ మారక ప్రభావంతో అదే ద్రవ్యోల్బణ రక్షణను అందిస్తాయి. ఈక్విటీ పెట్టుబడిదారులకు, గత సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సుమారుగా రూ. 84 నుండి రూ. 95కి పడిపోవడం ఒక సూచికగా పనిచేస్తుంది. .అయితే, దీనికి ప్రతివాదన ఉంది. లక్షలాది భారతీయ కుటుంబాలకు బంగారం ఒక విలాస వస్తువు కాదు; అది పొదుపు, పూచీకత్తు, భీమా అన్నీ కలిసిన రూపం. దానిని వదులుకోమని ప్రజలను కోరడం అంటే, స్పష్టంగా నిర్వచించిన ప్రత్యామ్నాయ విలువ నిధి లేకుండా, విలువ తగ్గుతున్న రూపాయిని అంగీకరించమని అడగడంతో సమానం. సావరిన్ గోల్డ్ బాండ్లు కొంత సహాయం అందిస్తున్నప్పటికీ, వాటి వ్యాప్తి పరిమితంగానే ఉంది. అదేవిధంగా, ఇంటి నుండే పనిచేసే వెసులుబాటు అనేది భారతదేశ శ్రామిక శక్తిలో అత్యధిక భాగానికి అందుబాటులో లేని ఒక అంశం. మోడీ చేసిన విజ్ఞప్తి ఉద్దేశం ఎంత మంచిదైనప్పటికీ, ఆదాయ పంపిణీలో ఒక వ్యక్తి ఉన్న స్థానాన్ని బట్టి అది వారిపై భిన్నమైన రీతిలో ప్రభావం చూపుతుంది..అంతిమంగా, మోడీ విజ్ఞప్తి అనేది ఒక ఆదేశం కాదు. అది, తాను నివసించే ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకుని, తదనుగుణంగా వ్యవహరించాలన్న ఒక ఆహ్వానం.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# తీర్పుకు తీరిక లేకపోతే.. ప్రజాస్వామ్యానికి భరోసా ఎక్కడ?

భారత సుప్రీం కోర్టు గురించి మాట్లాడటం అంటే కేవలం ఒక న్యాయస్థానం గురించి కాదు.. ఈ దేశ రాజ్యాంగ ఆత్మ గురించి మాట్లాడటమే. పౌర హక్కులకు చివరి రక్షణగా నిలిచే అత్యున్నత న్యాయస్థానం నేడు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. తొంభై మూడు వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉండగా, "న్యాయం నిజంగా సమయానికి అందుతోందా?" అనే ప్రశ్న దేశవ్యాప్తంగా వినిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మే 2026లో సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కు పెంచాలని నిర్ణయించడం స్వాగతించదగిన అడుగు. అయితే ఇది పరిష్కారం కాదు.. పరిష్కార దిశగా వేసిన తొలి అడుగు మాత్రమే. స్వాతంత్ర్యం సమయానికి దేశ జనాభా ముప్పై నాలుగు కోట్లు. అప్పట్లో ముగ్గురు న్యాయమూర్తులతో సుప్రీం కోర్టు పనిచేసేది. నేడు జనాభా నూట నలభై కోట్లకు చేరినా, న్యాయమూర్తుల సంఖ్య ముప్పై మూడే. చట్టాలు పెరిగాయి, వ్యాపార వివాదాలు పెరిగాయి, పౌరహక్కుల చైతన్యం విస్తరించింది, కేసుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కానీ న్యాయ వ్యవస్థ అదే వేగంతో విస్తరించలేదు. ఇదే అసలు సంక్షోభం. ప్రస్తుతం ఒక్కో న్యాయమూర్తిపై ఉన్న భారం అసాధారణం. సంవత్సరానికి డెబ్బై వేలకుపైగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. పని దినాలు పరిమితంగా ఉండటంతో, ఒక్కో న్యాయమూర్తి రోజుకు డెబ్బై నుంచి తొంభై కేసుల వరకు పరిశీలించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి కేసును లోతుగా అధ్యయనం చేయడం శారీరకంగా, మానసికంగా కూడా కష్టసాధ్యం. ఇది వ్యక్తుల వైఫల్యం కాదు.. వ్యవస్థపై పడిన అతిభారం. దీని ప్రభావం రాజ్యాంగ ధర్మాసనాలపైనా పడుతోంది.

*అలాగే న్యాయమూర్తుల సంఖ్యను దశలవారీగా యాభై, అరవైకి పెంచడం అవసరం. దానికి అనుగుణంగా కోర్టు హాళ్లు, న్యాయ పరిశోధకులు, సిబ్బంది, డిజిటల్ మౌలిక వసతులు కూడా పెరగాలి. కొలీజియం విధానంలో పారదర్శకత తీసుకురావడం, ఎంపిక ప్రమాణాలను స్పష్టీకరించడం కూడా కాలానుగుణ అవసరం. పదవీ విరమణ వయసును అరవై ఐదు నుంచి డెబ్బైకి పెంచాలనే వాదనకూ ప్రాధాన్యం ఉంది. న్యాయం ఆలస్యం అయితే నష్టపోయేది వ్యక్తి మాత్రమే కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా. పెట్టుబడులు తగ్గుతాయి, వ్యాపార విశ్వాసం దెబ్బతింటుంది, సాధారణ పౌరుడు న్యాయస్థానం పేరు వినగానే భయపడే పరిస్థితి ఏర్పడుతుంది. వేగవంతమైన, విశ్వసనీయ న్యాయ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి వెన్నెముక.*



అయిదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ బెంచీలు ఇప్పుడు అరుదుగా కూర్చుంటున్నాయి. ఫలితంగా దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే రాజ్యాంగపరమైన అంశాలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లోనే మిగిలిపోతున్నాయి. న్యాయమూర్తుల సంఖ్య పెరిగితే పరిస్థితి మారుతుంది. ఒకేసారి ఎక్కువ ధర్మాసనాలు కూర్చునే అవకాశం ఉంటుంది. రాజ్యాంగ అంశాలు, క్రిమినల్ కేసులు, సాధారణ పిటిషన్లు సమాంతరంగా విచారణకు వస్తాయి. దీంతో న్యాయమూర్తులకు ప్రతి కేసుపై ఎక్కువ సమయం కేటాయించే అవకాశం లభిస్తుంది. ఫలితంగా తీర్పుల నాణ్యత, వేగం రెండూ మెరుగుపడతాయి. "సంఖ్య పెరిగితే నాణ్యత తగ్గుతుంది" అనే వాదనలో బలం లేదు. ఉన్నత న్యాయస్థానాల్లో అనుభవం ఉన్న న్యాయమూర్తులు, అగ్రశ్రేణి న్యాయవాదులు దేశంలో కొరత కాదు. కొరత ఉన్నది రాజకీయ సంకల్పానికి, వ్యవస్థాగత సంస్కరణకు మాత్రమే.

అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాల్లో సుప్రీం కోర్టుల నిర్మాణం భిన్నంగా ఉంటుంది. అక్కడ దిగువ న్యాయస్థానాలే బలంగా ఉండటంతో కేసులు పైస్థాయికి తక్కువగా వస్తాయి. భారతదేశంలో మాత్రం జిల్లా, ఉన్నత న్యాయస్థానాల బలహీనత వల్లే అత్యధిక కేసులు సుప్రీం కోర్టు వరకు చేరుతున్నాయి. అందుకే విదేశీ నమూనాలను యథాతథంగా అనుసరించడం కాదు.. భారత పరిస్థితులకు సరిపోయే పరిష్కారం అవసరం.ఈ దేశంలో ప్రభుత్వమే అతిపెద్ద వ్యాజ్యకర్త కావడం మరో విస్మయకర వాస్తవం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల మధ్య జరిగే అనవసర వ్యాజ్యాలు సగానికి పైగా పెండింగ్ కేసులకు కారణమవుతున్నాయని అంచనా. ప్రభుత్వం నిజంగా సంస్కరణ కోరుకుంటే, ముందుగా తన వ్యాజ్య సంస్కృతిని మార్చుకోవాలి. అసలు పరిష్కారం దిగువ న్యాయవ్యవస్థ బలోపేతంలోనే ఉంది. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అయిదున్నర కోట్ల కేసుల్లో తొంభై శాతానికి పైగా జిల్లా, ఉన్నత న్యాయస్థానాల్లోనే ఉన్నాయి. అక్కడ మౌలిక వసతులు, న్యాయమూర్తుల నియామకాలు, సాంకేతిక సదుపాయాలు మెరుగుపడితే ప్రజలకు స్థానికంగానే వేగవంతమైన న్యాయం లభిస్తుంది. అప్పుడు సుప్రీం కోర్టు నిజంగా రాజ్యాంగ, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై దృష్టి పెట్టగలదు. మధ్యవర్తిత్వం, రాజీ కుదుర్పు విధానాలు కూడా విస్తరించాలి. కుటుంబ, వ్యాపార వివాదాలు కోర్టు బయటే పరిష్కారమయ్యే సంస్కృతి పెరిగితే లక్షలాది కేసులు తగ్గిపోతాయి.

**దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అయిదున్నర కోట్ల కేసుల్లో తొంభై శాతానికి పైగా జిల్లా, ఉన్నత న్యాయస్థానాల్లోనే ఉన్నాయి. అక్కడ మౌలిక వసతులు, న్యాయమూర్తుల నియామకాలు, సాంకేతిక సదుపాయాలు మెరుగుపడితే ప్రజలకు స్థానికంగానే వేగవంతమైన న్యాయం లభిస్తుంది. అప్పుడు సుప్రీం కోర్టు నిజంగా రాజ్యాంగ, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై దృష్టి పెట్టగలదు.**

అలాగే న్యాయమూర్తుల సంఖ్యను దశలవారీగా యాభై, అరవైకి పెంచడం అవసరం. దానికి అనుగుణంగా కోర్టు హాళ్లు, న్యాయ పరిశోధకులు, సిబ్బంది, డిజిటల్ మౌలిక వసతులు కూడా పెరగాలి. కొలీజియం విధానంలో పారదర్శకత తీసుకురావడం, ఎంపిక ప్రమాణాలను స్పష్టీకరించడం కూడా కాలానుగుణ అవసరం. పదవీ విరమణ వయసును అరవై ఐదు నుంచి డెబ్బైకి పెంచాలనే వాదనకూ ప్రాధాన్యం ఉంది. న్యాయం ఆలస్యం అయితే నష్టపోయేది వ్యక్తి మాత్రమే కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా. పెట్టుబడులు తగ్గుతాయి, వ్యాపార విశ్వాసం దెబ్బతింటుంది, సాధారణ పౌరుడు న్యాయస్థానం పేరు వినగానే భయపడే పరిస్థితి ఏర్పడుతుంది. వేగవంతమైన, విశ్వసనీయ న్యాయ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి వెన్నెముక. ప్రభుత్వం తీసుకున్న నాలుగు న్యాయమూర్తుల పెంపు నిర్ణయం ఒక మంచి ప్రారంభం. కానీ అది అక్కడితో ఆగిపోకూడదు. న్యాయమూర్తుల సంఖ్య పెంపు, దిగువ కోర్టుల బలోపేతం, ప్రభుత్వ వ్యాజ్యాల నియంత్రణ, మధ్యవర్తిత్వ ప్రోత్సాహం, సాంకేతిక సమైక్యత.. ఇవన్నీ కలిసే నిజమైన న్యాయ సంస్కరణకు దారి తీస్తాయి. రాజ్యాంగం ప్రసాదించిన న్యాయం ప్రతి పౌరుడికీ అందాలి — ధనికుడికే కాదు, పేదవాడికీ; నగరానికే కాదు, గ్రామానికీ. సుప్రీం కోర్టు బలోపేతం కేవలం న్యాయ వ్యవస్థ అవసరం కాదు.. అది భారత ప్రజాస్వామ్య భవిష్యత్తును రక్షించే జాతీయ బాధ్యత.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్
9010128884

# శుభ్రమైన హస్తం – సురక్షితమైన లోకం

ప్రపంచ మానవాళిని ఆరోగ్య పథంలో నడిపించే అత్యంత సరళమైన, శక్తివంతమైన ఆయుధం 'చేతుల పరిశుభ్రత'. నిత్యం మనం చేసే పనులలో భాగంగా చేతులు అనేక ఉపరి తలాలను తాకుతుంటాయి, తద్వారా కంటికి కనిపించని కోట్లాది సూక్ష్మ జీవులకు అవి వాహకాలుగా మారుతాయి. ఈ నేపథ్యంలో, చేతుల శుభ్రత పట్ల ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా మే 5వ తేదీన 'ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవం' (World Hand Hygiene Day) నిర్వహించబడుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) సారథ్యంలో సాగే ఈ ఉద్యమం కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు; ఇది ఒక జీవనశైలి మార్పుకు పిలుపు. ముఖ్యంగా వైద్య రంగంలో ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తిని అరికట్టడానికి మరియు సాధారణ ప్రజానీకంలో అంటువ్యాధుల ప్రభావాన్ని తగ్గించడానికి ఈ దినోత్సవం ప్రాముఖ్యత సంతరించుకుంది. చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యతను గుర్తించిన తొలినాటి వ్యక్తులలో ఇగ్నాజ్ సెమ్మెల్‌వైస్ (Ignaz Semmelweis) ప్రముఖులు. 1840వ దశకంలో వియన్నా లోని ఒక ఆసుపత్రిలో ప్రసవ సమయంలో తల్లుల మరణాల రేటు ఎక్కువగా ఉండడాన్ని గమనించిన ఆయన, వైద్యులు చేతులు కడుక్కోవడం ద్వారా ఆ మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని నిరూపించారు. ఆనాడు అది విమర్శలకు గురైనప్పటికీ, నేడు ఆధునిక వైద్య శాస్త్రానికి అదే పునాది అయ్యింది. 2009లో ప్రపంచ ఆరోగ్య సంస్థ 'సేవ్ లైవ్స్: క్లీన్ యువర్ హాండ్స్' (Save Lives: Clean Your Hands) అనే ప్రపంచ ప్రచారాన్ని ప్రారంభించి, మే 5ను అధికారికంగా చేతి పరిశుభ్రత దినోత్సవంగా ప్రకటించింది. ఐదవ నెలలోని ఐదవ రోజును ఎంచుకోవడానికి గల సంకేతం మన చేతికి ఉండే ఐదు వేళ్లు. ఈ ఐదు వేళ్లూ శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం మన హస్తగతమవుతుందన్నది దీని అంతరార్థం.

చేతుల పరిశుభ్రత కేవలం నీళ్లతో తడుపుకోవడం కాదు; దానికొక శాస్త్రీయ పద్ధతి ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రకారం, చేతులను కనీసం 20 నుండి 40 సెకన్ల పాటు



సబ్బుతో రుద్ది కడగాలి. అరచేతులు, వేళ్ల సందులు, గోళ్ల లోపలి భాగం, మణికట్టు వరకు ప్రతి అంగుళాన్ని శుభ్రం చేయాలి. ఒకవేళ సబ్బు అందుబాటులో లేకపోతే 60 శాతం ఆల్కహాల్ కలిగిన శానిటైజర్లను వినియోగించాలి. ముఖ్యంగా ఆహారం తీసుకునే ముందు, ఆహారం వండేటప్పుడు, మరుగుదొడ్లను ఉపయోగించిన తర్వాత, జంతువులను తాకినప్పుడు మరియు తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు చేతులను తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలి. ఆసుపత్రి వాతావరణం లోనైతే 'ఫైవ్ మూమెంట్స్' (Five Moments) అనే సూత్రాన్ని వైద్య సిబ్బంది పాటించాలి. రోగిని తాకక ముందు, వైద్య ప్రక్రియకు ముందు, శరీర ద్రవాల తాకిడి తర్వాత, రోగిని తాకిన తర్వాత మరియు రోగి పరిసరాలను తాకిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల ఆసుపత్రి సంబంధిత ఇన్‌ఫెక్షన్లను అడ్డుకోవచ్చు. గణాంకాల పరంగా చూస్తే, చేతుల పరిశుభ్రత యొక్క ప్రభావం ఆశ్చర్యకరంగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్షలాది మంది కేవలం అపరిశుభ్రత వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్ల కారణంగా మరణిస్తున్నారు. చేతులు సరిగ్గా కడుక్కోవడం వల్ల అతిసార వ్యాధుల (Diarrhea) ముప్పు 30 నుండి 40 శాతం తగ్గుతుందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు (Respiratory Infections) 20 శాతం వరకు తగ్గుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో శిశు మరణాల రేటును తగ్గించడంలో ఈ చిన్న అలవాటు కీలక పాత్ర పోషిస్తోంది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో, వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో మాస్క్ ధరించడంతో పాటు చేతుల పరిశుభ్రత ఎంతటి కీలక పాత్ర పోషించిందో మనందరం ప్రత్యక్షంగా చూశాం. ఇది కేవలం కోవిడ్‌కే కాదు, నిమోనియా, కలరా వంటి తీవ్రమైన వ్యాధులకు కూడా చెక్ పెడుతుంది. అయితే, నేటికీ ప్రపంచ జనాభాలో గణనీయమైన శాతం మందికి సురక్షితమైన నీరు మరియు సబ్బు అందుబాటులో లేకపోవడం విచారకరం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక సదుపాయాల కొరత పెద్ద సవాలుగా మారింది. ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేసి, ప్రతి చోటా నీటి సదుపాయం కల్పించడంతో పాటు, ప్రజలలో ప్రవర్తనా మార్పును తీసుకు రావాలి. చిన్నతనం నుండే పిల్లలకు పాఠశాలల్లో చేతులు కడుక్కోవడం ఒక క్రతువులా అలవాటు చేయాలి. 'నేర్చుకున్న విద్య – అలవాటైన శుభ్రత' అనే చందంగా బాల్యంలో ఏర్పడిన ఈ అలవాటు వారిని జీవితాంతం ఆరోగ్యవంతులుగా ఉంచుతుంది.

ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తిని నిజం చేయాలంటే మనం పాటించాల్సిన మొదటి నియమం చేతుల పరిశుభ్రత. ఇది ఖర్చు లేని, సులభమైన మరియు అత్యంత ప్రభావవంతమైన నివారణోపాయం. "మనం రక్షించే ప్రాణాలు మన చేతుల్లోనే ఉన్నాయి" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ స్మరించాలి. వైద్యులు, నర్సులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు – ఇలా సమాజంలోని ప్రతి వర్గం తమ వంతు బాధ్యతగా పరిశుభ్రత పట్ల చైతన్యాన్ని వ్యాప్తి చేయాలి. మే 5వ తేదీన జరుపుకునే ఈ ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవం కేవలం ఒక వేడుకగా మిగిలి పోకుండా, ప్రతి రోజూ ప్రతి నిమిషం మన చేతులను నిష్కల్మషంగా ఉంచుకుందామని ప్రతిజ్ఞ చేద్దాం. పరిశుభ్రమైన చేతులే సురక్షితమైన ప్రపంచానికి పునాదులు. వ్యాధుల రహిత సమాజాన్ని నిర్మించే క్రమంలో మనమందరం ఒకటై, శుభ్రతను ఒక సంస్కృతిగా మార్చుకుందాం. ఇదే మనం రేపటి తరానికి ఇచ్చే నిజమైన ఆరోగ్య కానుక.



సంగనబట్ల
9440595494

## భవసాగర తీరాలు

భవసాగరాన్ని
సులువుగా ఈదుతూ..
విజయ తీరాల్ని ముద్దాడటానికి..
అభద్రత, దురాశ, వస్తువ్యా
మోహం..
సోమరితనం, అతి
విశ్వాసం లాంటి..

శరీర బరువులను తగ్గించుకో..
పొగడ్తల అలలను తప్పించుకో..
పక్క వాడిని చూసి బుద్ధి
తెచ్చుకో..
ఈర్ష్య, అసూయల కొవ్వును కరి
గించుకో..
సానుకూల దృక్పథ టైరును..

నడుముకు గట్టిగా
చుట్టేసుకో..
కరుణ, దయల ఆసరా
తీసుకో..
మానవీయ శ్వాసను
అదుపులో ఉంచుకో..
చేయూత నిచ్చిన

చేతులకు దండం పెట్టుకో..
తీరం చేరాక తెప్ప
తగిలేయవద్దని తెలుసుకో !

మధుపాళీ
9949700037

# నిశ్శబ్దమే నీ స్వేచ్ఛా ప్రకటన

ఇప్పుడు మనం నిశ్శబ్దం గురించి కాస్త మాట్లాడుకుందాం. నిశ్శబ్దం అనేది శూన్యం కాదు, అది ఒక నిండుతనం. ఈ సమాజం మనల్ని మాటలతో, నిర్వచనాలతో బంధించాలని చూస్తున్నప్పుడు, "నేను మీకు అందను" అని చెప్పే నిశ్శబ్దమే మన స్వేచ్ఛా పతాకం. అది మనల్ని మనకే పరిచయం చేస్తుంది. "నిశ్శబ్దం అనేది ఒక రకంగా స్వేచ్ఛకు పునాది. "నిశ్శబ్దమే నీ స్వేచ్ఛా ప్రకటన" ఈ మాట వినడానికి సాదాసీదాగా అనిపించినా, దీని వెనుక అనంతమైన తాత్వికత, మానసిక లోతు ఉంది. ఆధునిక ప్రపంచంలో "మాట్లాడటమే" ఉనికి అని భావిస్తుంటారు. "నిశ్శబ్దం"గా ఉండటాన్ని నిస్సయతగా అనుకుంటుంటారు. "నిశ్శబ్దం"గా ఉన్నవారిని శక్తిలేనివారిగా ఒంటరైనవారిగా భావిస్తుంటారు. కానీ "నిశ్శబ్దం"అనేది ఒక తిరుగుబాటుగా, అత్యున్నత స్వేచ్ఛా ప్రకటనగా చూడాలి. అంతే కాదు చాలామంది నిశ్శబ్దాన్ని నిస్సహాయత అనుకుంటారు. కానీ నిజానికి, అనవసరమైన చోట మౌనంగా ఉండగలగడం అత్యున్నతమైన శక్తి. ఈ ప్రపంచం మనల్ని రకరకాల అభిప్రాయాలతో ప్రభావితం చేయాలని చూస్తున్నప్పుడు, వాటన్నింటినీ కాదని మనలో మనం స్థిరంగా ఉండటమే నిజమైన స్వేచ్ఛ. నేటి సోషల్ మీడియా కాలంలో ప్రతి చిన్న విషయానికి స్పందించడం ఒక అలవాటుగా మారింది. అందరూ ట్రెండింగ్ విషయాల మీద పోస్టులు పెడుతున్నప్పుడు, మీరు ఏమీ స్పందించకుండా ఉండటం కూడా ఒక గొప్ప స్వేచ్ఛే. అది "నేను ఈ డిజిటల్ గొర్రెల మందలో భాగం కాదు" అని మీరు మీకు ఇచ్చుకునే స్వేచ్ఛా ప్రకటన. మనం చూస్తుంటాం. మనం ఎప్పుడూ ఇతరులకు సమాధానం చెప్పాలనే తాపత్రయంలో ఉంటాం. ఎవరైనా విమర్శిస్తే వెంటనే కౌంటర్ ఇవ్వాలి అనుకుంటాం. ఎవరైనా ఆరోపణలు చేస్తే కంగారు పడటంమో, ఉలిక్కిపడటమో చేస్తుంటాం. కానీ "నేను ఎవరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు" అని మీరు అనుకున్న క్షణం, మీరు స్వేచ్ఛా జీవి అవుతారు. సమాజంలో మన గురించి రకరకాల పుకార్లు లేదా విమర్శలు వస్తుంటాయి. ప్రతిదానికీ వివరణ ఇచ్చుకుంటూ పోతే మన శక్తి వృధా అవుతుందని గ్రహించాలి. మౌనంగా ఉండి తమ పని ద్వారా సమాధానం చెప్పడం అంటే ఆ మౌనం "నా విలువ నాకు తెలుసు, మీ సర్టిఫికెట్లు నాకు అక్కర్లేదు" అనే స్వేచ్ఛను ప్రకటిస్తుందని అందరికి అర్థం కానీ నిశ్శబ్ద స్వేచ్ఛా ప్రకటన. శబ్దం ఉన్న చోట గందరగోళం ఉంటుంది. నిశ్శబ్దం ఉన్న చోట స్పష్టత ఉంటుంది. గొప్ప ఆవిష్కరణలు, లోతైన ఆలోచనలు అన్నీ ప్రశాంతమైన మౌనంలోనే పుడతాయి. మనల్ని మనం తెలుసుకోవడానికి ఒక అత్యున్నతమైన ఆయుధంగా ఉంటుంది. కొన్నిసార్లు నిశ్శబ్దం అత్యంత శక్తివంతమైన నిరసనగా కూడా ఉంటుంది. అనవసరమైన తర్కాలకు తావు ఇవ్వకుండా, మౌనంగా తన పని తాను చేసుకుపోవడం అనేది ఎదుటివారి అహంకారాన్ని దెబ్బతీసే ఒక పదునైన యుద్ధ ప్రకటన కూడా అనేది ఆ మౌన తాత్వాకత కలిగిన మనుషులకు ఉంటుంది.




ఇక్కడ మనం ఎంతోకొంత అర్థం చేసుకోవాల్సిన అంశం ఏమిటంటే "నిశ్శబ్దమే నీ స్వేచ్ఛా ప్రకటన" అంటే అర్థం నీ మనసుపై నీకు పూర్తి నియంత్రణ ఉందని ప్రపంచానికి చాటి చెప్పడం. మాటల ప్రవాహంలో కొట్టుకుపోకుండా, నీ నిశ్శబ్దంలో నువ్వు గంభీరంగా నిలబడగలిగితే, అదే నీ అసలైన గెలుపు. నీవు ఎంత తక్కువగా మాట్లాడితే, ప్రపంచం నీ మాటల కోసం అంత ఎక్కువగా వేచి చూస్తుంది. నీ మౌనం నీ బలం కావాలి కానీ బలహీనత కాకూడదు. అందుకే ఎదుటి వ్యక్తి నిశ్శబ్దంగా ఉంటే అదేదో బలహీనతగానో, నిస్సయతగానో చూడటం అజ్ఞానమే అవుతుంది. నిశ్శబ్దంగా ఉన్న వ్యక్తిలో తాత్విక కోణంలో స్వేచ్ఛా ప్రకటన, ధిక్కారం, ఈ సమాజం విధించే అనవసరమైన నిబంధనలు తోసిపుచ్చుతూ నిశ్శబ్ద స్వేచ్ఛా ప్రకటన చేస్తున్నాడా అనేదే ప్రమాణికంగా ఉంటుంది.



రాజేందర్ దామెర
(దారా)
సీనియర్ జర్నలిస్ట్

# జాతీయం-అంతర్జాతీయం

## ప్రధాని మోడీ కాన్వాయ్‌ను కుదింపు

**ఈవీల వినియోగానికి ప్రోత్సాహం**





**న్యూఢిల్లీ, మే 13 (వుదయం):**
పొదుపు చర్యలను పాటించాలని, ఇంధనంతో నడిచే వాహనాల వినియోగాన్ని తగ్గించుకోవాలని పౌరులకు పిలుపునిచ్చిన కొద్ది రోజులకే, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన అధికారిక వాహన శ్రేణి పరిమాణాన్ని గణనీయంగా తగ్గించారు.హైదరాబాద్‌లో ప్రధాని ప్రసంగం అనంతరం, ఆయన ఇటీవల గుజరాత్, అస్సాంలలో పర్యటించిన సందర్భంగా ఈ కుదించిన కాన్వాయ్‌ను మోహరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎస్పీజీ ప్రోటోకాల్ ప్రకారం తప్పనిసరి అయిన అన్ని కీలక భద్రతా ఏర్పాట్లను కొనసాగిస్తూనే, ఈ తగ్గింపును చేపట్టారు.

సాధ్యమైనంత మేర, ఎటువంటి కొత్త కొనుగోళ్లు చేయకుండానే తన కాన్వాయ్‌లో విద్యుత్ వాహనాలను (ఎలక్ట్రిక్ వెహికిల్స్) చేర్చాలని మోడీ అధికారులను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

'బ్లూ బుక్'లో నిర్దేశించిన తప్పనిసరి భద్రతా మార్గదర్శకాల విషయంలో ఎటువంటి రాజీ లేకుండా చూసుకుంటూనే, ఎస్‌పిజి ఇప్పటికే ఈ ఆదేశాన్ని అమలు చేయడం ప్రారంభించింది.

ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలన్న ప్రధానమంత్రి విజ్ఞప్తుల నేపథ్యంలో, హోంమంత్రి కూడా తన కాన్వాయ్ పరిమాణాన్ని సగానికంటే తక్కువకు తగ్గించేందుకు చర్యలు చేపట్టారు.

హైదరాబాద్‌లో ప్రధానమంత్రి ప్రసంగించిన కొద్దికాలానికే, గుజరాత్, అసోంలలో ఆయన ఇటీవల పర్యటించిన సందర్భాల్లో ఈ కుదించిన కాన్వాయ్‌నే వినియోగించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

రాబోయే రోజుల్లో పొదుపు చర్యలకు అధికారులు సన్నద్ధమవుతున్నట్లు మంత్రిత్వ శాఖలు, విభాగాల నుంచి కూడా సూచనలు వెలువడుతున్నాయి.

పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించడం, నగరాల్లో మెట్రో రైలు సేవలను ఉపయోగించడం, కార్‌పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడం, పార్శిల్ రవాణాకు రైల్వే సేవలను వినియోగించుకోవడం, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు ఇంటి నుంచి పనిచేయడం వంటివి చేయాలని ప్రధానమంత్రి సూచించారు.

ఇంధన వినియోగాన్ని తగ్గించగల సాధ్యమైన అన్ని చర్యలను గుర్తించాల్సిందిగా వివిధ శాఖలన్నింటికీ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రధానమంత్రి సందేశం తమతో సహా అందరికీ వర్తిస్తుంది. తాము ఏమి చేయాలనే విషయాలను వివరిస్తూ, సిబ్బంది, శిక్షణ శాఖ (డిఒపిటి) నుండి వచ్చే సమాచారం కోసం ఎదురుచూస్తున్నాం. అయితే, ప్రతి శాఖా తమ సొంత ప్రణాళికలను రూపొందించుకోవాల్సి ఉంటుంది, అని ఒక సీనియర్ అధికారి తెలిపారు.

సోమవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన మంత్రుల అనధికారిక బృందం సమావేశంలో అనవసర ప్రయాణాలను తగ్గించడం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించే అంశంపై కూడా చర్చ జరిగింది.

ఈ వారం ప్రారంభంలో సికింద్రాబాద్‌లో జరిగిన ఒక సభలో ప్రధాని మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో దేశభక్తి అనేది దేశ సరిహద్దులను కాపాడటానికే పరిమితం కాదని, దైనందిన జీవితంలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను కూడా కలిగి ఉంటుందని నొక్కి చెప్పారు.

దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండటం మాత్రమే కాదు. ప్రస్తుత తరుణంలో, బాధ్యతాయుతంగా జీవిస్తూ, మన దైనందిన జీవితంలో దేశం పట్ల మన విధులను నిర్వర్తించడమే దేశభక్తి, అని ప్రధానమంత్రి అన్నారు.

ప్రపంచవ్యాప్త అంతరాయాలు, పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావాన్ని ప్రస్తావిస్తూ, ప్రజా రవాణా, కార్‌పూలింగ్, ఎలక్ట్రిక్ వాహనాలను ఎక్కువగా ఉపయోగించడం ద్వారా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని మోడీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి వంట నూనెల వినియోగాన్ని తగ్గించుకోవాలని ఆయన పౌరులను కోరారు. అలాగే, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సహజ వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లాలని రైతులకు పిలుపునిచ్చారు.



## బొగ్గు గ్యాసిఫికేషన్‌ను ఆమోదించిన కేంద్రం

**న్యూఢిల్లీ, మే 13 (వుదయం):**
పశ్చిమాసియా సంక్షోభం తీవ్రతరం కావడం ఒక ప్రధాన ఆందోళనగా మారిన నేపథ్యంలో, బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశానంతరం, కేంద్రం కీలక ఆర్థిక చర్యలను వివరించనుంది. ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన రూ. 37,500 కోట్ల పథకానికి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న విస్తృత పొదుపు, ఇంధన భద్రత చర్యల నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జి, యూరియా, అమ్మోనియా, మిథనాల్‌పై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ పథకం లక్ష్యం.

"ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం, రూ. 37,500 కోట్ల ఆర్థిక వ్యయంతో ఉపరితల బొగ్గు/లిగ్నైట్ వాయువీకరణ ప్రాజెక్టుల ప్రోత్సాహానికి ఉద్దేశించిన ఒక పథకానికి ఆమోదం తెలిపిందని ఒక అధికారిక ప్రకటన పేర్కొంది."

దేశంలో 401 మిలియన్ టన్నుల గుర్తించిన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఇవి రాబోయే 200 ఏళ్లకు సరిపోతాయని, సమావేశ వివరాలను వెల్లడిస్తూ కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ తాజా పథకం, 2021లో ప్రారంభించిన 'జాతీయ బొగ్గు గ్యాసిఫికేషన్ మిషన్'లో ఒక భాగం; అలాగే, జనవరి 2024లో ఆమోదించిన రూ. 8,500 కోట్ల బొగ్గు వాయువీకరణ పథకాన్ని అనుసరించి దీనిని రూపొందించారు. ఆ పథకం కింద ప్రస్తుతం రూ. 6,233 కోట్ల విలువైన ఎనిమిది ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. ఈ గ్యాసిఫికేషన్ ద్వారా 50 వేలమందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఏడాదికి రూ.6,300 కోట్ల ఆదాయం వస్తుంది. ప్రస్తుతమున్న అంతర్జాతీయ పరిస్థితులు అందరికీ తెలుసు. ఈ క్రమంలోనే తాజా నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు.

**బొగ్గు గాసిఫికేషన్ అంటే ఏమిటి?**

బొగ్గును వాయువుగా మార్చడం అంటే పొడి ఇంధనాన్ని కృత్రిమ వాయువుగా (సింగాస్) మార్చే ప్రక్రియ. దీనిని ప్రత్యామ్నాయ ఇంధనంగా ఉపయోగించడంతో పాటు, కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది. ఈ ప్రక్రియ మిథెనాల్, ఎరువులు, హైడ్రోజన్, రసాయనాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. తద్వారా దిగుమతి చేసుకునే చమురు, మిథెనాల్, అమ్మోనియాపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది.

అంతేకాకుండా, పంట సేకరణకు మద్దతు ఇవ్వడానికి, రైతులకు సరైన ధర లభించేలా చూడటానికి, 2026 27 ఖరీఫ్ ఎంఎస్‌పి కార్యకలాపాల కోసం రూ. 2.6 లక్షల కోట్లను కూడా మంత్రివర్గం ఆమోదించింది. 026 27 ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరకు కేంద్రం ఆమోదం తెలిపింది. క్వింటాల్ వరికి కనీస మద్దతు ధర రూ.2,441గా నిర్ణయించారు. వరి(ఏ గ్రేడ్)కి రూ.2,461కి పెంచారు. క్వింటాల్ జొన్నలు (హైబ్రిడ్) కనీస మద్దతు ధర రూ.4,023గా ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. జొన్నలు (మల్దండి) ధర రూ.4, 073గా నిర్ణయించారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు త్వరలోనే పెరిగే అవకాశం ఉంది:ఆర్‌బిఐ గవర్నర్

**ఇరాన్ యుద్ధం కొనసాగి, చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లు దాటితే పెంపు తప్పదు**



**న్యూఢిల్లీ, మే 13:**
మధ్యప్రాచ్య సంఘర్షణ కొనసాగితే, ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడం వల్ల పెట్రోల్, డీజిల్ ధరలను పెంచక తప్పదని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న ఇంధన ధరలు, భారతదేశపు సరళమైన ద్రవ్యోల్బణ లక్ష్య నిర్దేశాన్ని పరీక్షిస్తున్నాయని, దీనివల్ల రిజర్వ్ బ్యాంక్ విధానపరమైన జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతోందని ఆర్‌బిఐ గవర్నర్ నొక్కి చెప్పారు. ఆయన మంగళవారం స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంయుక్తంగా నిర్వహించిన ఒక సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.పశ్చిమాసియా సంక్షోభం కొనసాగితే, రిటైల్ ఇంధన ధరలను పెంచడం, కాలం గడిచే కొద్దీ జరిగే విషయమే అని, దానివల్ల రవాణా ఖర్చులు, ద్రవ్యోల్బణం పెరుగుతాయని గవర్నర్ సూచించారు. ఏప్రిల్ 2026 సమావేశంలో, ఆర్‌బిఐ ద్రవ్య విధాన కమిటీ తటస్థ వైఖరిని కొనసాగిస్తూ, రెపో రేటును 5.25 శాతంగా యథాతథంగా ఉంచాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది.ప్రపంచ అనిశ్చితుల నడుమ ద్రవ్యోల్బణంపై కన్నేసి ఉంచుతూనే, బలమైన దేశీయ వృద్ధిని సమతుల్యం చేసేందుకు అనుసరిస్తున్న వేచి చూసే వ్యూహాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తుంది. మేం డేటాపై మరింత ఎక్కువగా ఆధారపడుతున్నాం. ఆర్‌బిఐ తన విధానంలో సరళంగా వ్యవహరిస్తోంది. ఈ షాక్ తాత్కాలికమైతే దానిని తట్టుకుని నిలబడటానికి సిద్ధంగా ఉంది, కానీ అది పాతుకుపోతే, మనం చర్యలు తీసుకోవాలి, అని మల్హోత్రా అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటి భారీగా పెరిగినప్పటికీ, ఇంధన ధరలను పెంచకపోవడం వల్ల ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రోజుకు దాదాపు రూ. 1,000 కోట్ల నష్టాలను చవిచూస్తున్నాయని పూరి అన్నారు. భారతదేశం తన ముడి చమురు అవసరాలలో 88 శాతం వరకు దిగుమతి చేసుకుంటుంది, ప్రపంచ ధరలలో ఏ పెరుగుదల అయినా పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి ఉత్పత్తి వ్యయంలో తీవ్రమైన పెరుగుదలకు దారితీస్తుంది. మంత్రి ప్రకారం, వసూళ్లలో లోటు రూ. 1.98 లక్షల కోట్లకు చేరుకోగా, జూన్ ప్రస్తుత త్రైమాసికంలో నష్టాలు దాదాపు రూ. 1 లక్ష కోట్లుగా ఉన్నాయి. నిరంతరాయ సరఫరాను నిర్ధారించడానికి చమురు కంపెనీలు ఎల్‌పిజి ఉత్పత్తిని గతంలోని సుమారు 35,000 టన్నుల నుండి 55,00056,000 టన్నులకు పెంచాయని పూరి చెప్పారు. భారతదేశం వద్ద ప్రస్తుతం సుమారు 76 రోజుల డిమాండ్‌కు సమానమైన ముడి చమురు నిల్వలు ఉన్నాయని కూడా మంత్రి తెలిపారు.

## ప్రభుత్వం స్వప్రచారానికి ఖర్చు చేస్తుండగా పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారు: ఖర్గే



**వుదయం డెస్క్, మే 13:**
ప్రభుత్వం స్వీయ ప్రచారం, ఇతర ప్రచార కార్యక్రమాలపై భారీగా ఖర్చు చేస్తుండగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పౌరులకు పొదుపు గురించి ప్రబోధాలు చేస్తున్నారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం ఆయనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత 12 ఏళ్లుగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇచ్చే స్వల్ప పెన్షన్లను పెంచకపోవడం ద్వారా ప్రభుత్వం వారి గౌరవాన్ని హరించివేసిందని ఎక్స్‌పై చేసిన పోస్టులో ఖర్గే ఆరోపించారు.

నరేంద్ర మోడీ గారూ, మీరు దేశానికి పొదుపు, త్యాగాల గురించి ఉపన్యాసాలు ఇస్తూనే, మరోవైపు భారతదేశ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల గౌరవాన్ని హరిస్తున్నారు. ఎందుకు? గత 12 ఏళ్లుగా, పెరుగుతున్న ధరల భారం మన పేదలను చితికిపోయేలా చేస్తున్నప్పటికీ, బీజేపీ వృద్ధాప్య పెన్షన్లను ఒక్క పైసా కూడా పెంచడానికి నిరాకరించింది, అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

కొనుగోలు శక్తిలో 45 శాతం క్షీణత తర్వాత, నేటి విలువల్లో రూ. 200 పెన్షన్ వాస్తవానికి సుమారు రూ. 110కి, రూ. 300 పెన్షన్ సుమారు రూ. 165కి, రూ. 500 పెన్షన్ సుమారు రూ. 275కి సమానంగా ఉంది.కానీ ఈ సిగ్గులేని ప్రభుత్వం, ప్రతి రోజూ ప్రకటనలపైనా, ఆర్భాటపు స్వప్రచారాలపైనా దాదాపు రూ. 1.5 కోట్లు ఖర్చు చేయడానికి మొగ్గు చూపుతోంది! 201415 202425 మధ్య కాలంలో, బీజేపీ ప్రభుత్వం ప్రకటనల రూపంలో తన స్వప్రచారం కోసం మొత్తం రూ. 5,987.46 కోట్లు ఖర్చు చేసింది, అని ఆయన ఆరోపించారు.

ఈ క్రూరమైన బీజేపీ నమూనా, రాజకీయ ఆర్భాటాల కోసం విపరీతంగా ఖర్చు చేస్తూనే, నిరుపేద పౌరుల ఆర్థిక గౌరవాన్ని హరిస్తోంది, అని ఆయన అన్నారు. పశ్చిమ ఆసియా సంక్షోభం నేపథ్యంలో, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు గాను, ఇంధనాన్ని ఆదా చేయడం, బంగారం కొనకపోవడం లేదా విదేశీ పర్యటనలకు వెళ్లకపోవడం ద్వారా పొదుపు పాటించాలని ప్రధానమంత్రి మోడీ భారతీయులకు పిలుపునిచ్చిన అనంతరం కాంగ్రెస్ ఈ విమర్శనాస్త్రాలను సంధించింది.

## మిలిటెంట్ల దాడిలో ముగ్గురు చర్చి నాయకులు మృతి, నలుగురికి గాయాలు




**వుదయం డెస్క్, మే 13:**
బుధవారం ఉదయం మణిపూర్‌లో చర్చి అధికారుల ప్రతినిధి బృందంపై మిలిటెంట్లు మెరుపుదాడి చేయడంతో, ముగ్గురు కూకీ చర్చి నాయకులు మరణించగా, మరో నలుగురు గాయపడ్డారని అధికారులు తెలిపారు.

తాడౌ బాప్టిస్ట్ అసోసియేషన్ (టిబిఏ), యునైటెడ్ బాప్టిస్ట్ కౌన్సిల్‌కు చెందిన బాధితులు, వివిధ సంఘాల మధ్య జరిగే మతపరమైన సమావేశానికి హాజరయ్యేందుకు చురాచంద్‌పూర్ నుండి కాంగ్‌పోక్పికి ప్రయాణిస్తుండగా ఈ దాడి జరిగింది. మృతులను టిబిఏ అధ్యక్షుడు రెవరెండ్ వి సిట్లౌ, రెవరెండ్ వి కైగౌలున్, పాస్టర్ పాగౌలెన్‌గా గుర్తించారు. రెవరెండ్ ఎస్ ఎం హౌపు, రెవవరెండ్ హెకై సిప్పే, రెవరెండ్ పాథాంగ్, డ్రైవర్ గౌమాంగ్ కూడా సభ్యులుగా ఉన్న బృందానికి రెవరెండ్ సిట్లౌ నాయకత్వం వహిస్తున్నారు. ఈ ఘటనలో మరో నలుగురు గాయపడ్డారు.హత్యల అనంతరం, నిరసనగా థాడౌ సంస్థలు కాంగ్‌పోక్పి జిల్లాలోని సదర్ హిల్స్‌లో సంపూర్ణ బంద్ ను ప్రకటించాయి. ఇదిలా ఉండగా, కుకీ, నాగా వర్గాలకు చెందిన వ్యక్తులు అపహరణకు గురయ్యారని ధృవీకరించని సోషల్ మీడియా నివేదికలు కూడా సూచించాయి. అయితే ఈ వాదనలు స్వతంత్రంగా నిర్ధారితం కాలేదు.నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలిమ్ (ఎన్ ఎస్‌సిఎన్‌ఐఎం) లోని ఇసాక్‌ముయివా వర్గం, జెలియాంగ్‌రాంగ్ యునైటెడ్ ఫ్రంట్‌తో కుమ్మక్కై ఈ క్రూరమైన మెరుపుదాడికి పాల్పడిందని ఆరోపిస్తూ, కూకీ మానవ హక్కుల సంస్థ ట్రస్ట్ (కెఒహెచ్‌యుఆర్ కోహూర్) దీనిని తీవ్రంగా ఖండించింది.

ఇది ఏదో ఒక సంఘటనో లేదా దురదృష్టకరమైన ఘటనో కాదు. ఇది ఒక ముందస్తు ప్రణాళికతో కూడిన ఉగ్రవాద చర్య, అని కోహూర్ ఒక ప్రకటనలో పేర్కొంది. బాధితులు ఒక శాంతి ప్రయత్నంలో భాగమని, నాగాలాండ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో నాగాలాండ్‌లో ఒక సంప్రదింపు సమావేశాన్ని నిర్వహించడంలో వారు ఇటీవల పాలుపంచుకున్నారని ఆ సంస్థ పేర్కొంది. ఈ ప్రయత్నాన్ని అది సున్నితమైనదే అయినప్పటికీ అత్యంత కీలకమైన చొరవగా అభివర్ణించింది. అయితే దీనికి ఎన్ ఎస్‌సిఎన్‌ఐఎం ఇప్పుడు తూటాలతో సమాధానం ఇచ్చిందని ఆ సంస్థ వ్యాఖ్యానించింది. హత్యకు గురైన చర్చి నాయకులు ప్రతిఘటనకు కాకుండా, సయోధ్యకు ప్రతీకలని కూడా ఆ ప్రకటన పేర్కొంది. భారీ వ్యక్తిగత ముప్పు ఉన్నప్పటికీ, వారు కుకీ, తంగ్‌ఖుల్ నాగా వర్గాల మధ్య సంభాషణలను పెంపొందించే దిశగా కృషి చేశారని అందులో ప్రస్తావించారు.

ఈ ఏడాది ఫిబ్రవరి నుండి, మణిపూర్‌లోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉఖ్రుల్ జిల్లాలో కుకీ, తంగ్‌ఖుల్ నాగా వర్గాల మధ్య హింసాత్మక ఘటనల పరంపర కొనసాగుతోంది. ఈ ఘర్షణల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోగా, అనేక ఇళ్లకు నిప్పుపెట్టారు.

ఈశాన్య భారతదేశపు యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఈ హత్యల పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, మృతులను దేవుని సేవకులుగా అభివర్ణించింది.శాంతి, సేవ, తమ సమాజాల ఆధ్యాత్మిక ఉన్నతి కోసం తమ జీవితాలను అంకితం చేసిన దేవుని సేవకుల ప్రాణాలను, ఈ క్రూరమైన, అమానవీయమైన హింసాకాండ బలిగొంది, అని ఆ ఫోరం పేర్కొంది. సంఘర్షణలతో దీర్ఘకాలంగా దెబ్బతిన్న ప్రాంతంలో చర్చి నాయకులు, ఆధ్యాత్మిక కాపరులు మాత్రమే కాకుండా ఆశ, సయోధ్య, నైతిక మార్గదర్శకత్వానికి మూలస్తంభాలు, అని అది పేర్కొంది.



## సి ఎం ని కలవడానికి వెళ్లిన టీఎంసీ ఎమ్మెల్యేల బృందం

**కోల్‌కత, మే 13 (వుదయం):**
బుధవారం నాడు పశ్చిమ బెంగాల్ శాసనసభలో శాసనసభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల బృందం ముఖ్యమంత్రి సువేందు అధికారిని ఆయన ఛాంబర్‌లో కలిసింది.

ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ తొలి ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న సువేందును కలిసిన తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో, హరిహర్‌పారాకు చెందిన నియామత్ షేక్, రఘునాథ్‌గంజ్‌కు చెందిన అఖ్రుజ్జమాన్, సూటికి చెందిన ఇమానీ బిస్వాస్ వంటి శాసనసభ్యులు ఉన్నారు.

సువేందును ఆయన ఛాంబర్‌లో కలిసేందుకు తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎగబడటం, బీజేపీ శిబిరానికి చెందిన పలువురు శాసనసభ్యుల ఆశ్చర్యానికి కారణమైంది.

ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా, అధికార, ప్రతిపక్ష వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలవడం ఒక రాజకీయ మర్యాదగా పరిగణిస్తారు.అయితే, ఎన్నికల్లో ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా బరిలోకి దింపని బీజేపీ ప్రభుత్వ ముఖ్యమంత్రిని కలవడానికి, ప్రధానంగా మైనారిటీ వర్గానికి చెందిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఇంతగా ఆతురత చూపడం వెనుక ఏవైనా రాజకీయ సమీకరణాలు పనిచేస్తున్నాయేమోనని రాజకీయ పరిశీలకులు ఊహాగానాలు చేశారు.

సువేందు, తొలిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఈ రోజు ఉదయం సుమారు 11 గంటలకు శాసనసభ ప్రాంగణానికి చేరుకుని, బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అక్కడ ఆయనకు గౌరవ వందనం సమర్పించారు.

సోమవారం నాడు, ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్ర అధికార కేంద్రమైన నబన్నను సందర్శించినప్పుడు కూడా ఆయనకు ఇదే విధమైన గౌరవం లభించింది.అసెంబ్లీ సభా మండపంలోకి ప్రవేశించే ముందు, ఆయన సభ ద్వారం వద్ద మోకరిల్లి, తన నుదుటిని నేలకు ఆనించారు. ఆ తర్వాత ఆయన తన గదికి వెళ్లి, అక్కడ ప్రార్థన చేశారు.

భవానిపూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముఖ్యమంత్రి శాసనసభ ప్రధాన సభామండపంలోకి ప్రవేశించారు. ఈ నియోజకవర్గంలోనే ఆయన, తన ప్రత్యర్థి అయిన తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీని 15,000కు పైగా ఓట్ల తేడాతో ఓడించారు.

బుధవారం, తాత్కాలిక సభాపతి తపస్ రాయ్ ప్రమాణ స్వీకారం చేయించారు. 294 మంది సభ్యులు కలిగిన సభలో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కీర్తనియా, క్షుదిరామ్ టుడు, నిసిత్ ప్రమాణిక్ కూడా ఉన్నారు.

భారీగా బలగాలను మోహరించి, అసెంబ్లీ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. మిగిలిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం గురువారం అసెంబ్లీలో జరగనుంది.

## నీట్ పేపర్ లీక్ కేసు మూడవ అనుమానితురాలి అరెస్టు



**వుదయం డెస్క్, మే 13:**
నీట్ యుజి 2026 ప్రశ్నాపత్ర లీకేజీ కేసులో, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్న మరుసటి రోజే, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ఒక మహిళను అదుపులోకి తీసుకుంది. బుధవారం నాడు మహారాష్ట్రలోని పుణే జిల్లాలో ఆ మహిళను అదుపులోకి తీసుకున్నారు.

ఈ కేసులో నిందితురాలైన మహిళ మూడవ అనుమానితురాలు.

సిబిఐ, పూణే పోలీసుల క్రైమ్ బ్రాంచ్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్ అనంతరం ఈ మహిళను అదుపులోకి తీసుకున్నారు. మనీషా వాఘ్మారేగా గుర్తించిన ఈ నిందితురాలిని, బుధవారం తెల్లవారుజామున పూణేలోని బిబ్వేవాడి ప్రాంతం నుండి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం, నీట్ పేపర్ లీక్ కేసులో ఈమె మూడవ అనుమానితురాలు. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న ఒక భారీ ముఠా ప్రమేయం ఈ కేసులో ఉందని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి.నిందితుడు శుభమ్ ఖైర్నారే కోర్టులో హాజరుపరిచిన సిబిఐ

ఈ ఉదయం, సిబిఐ అధికారులు నిందితుడు శుభమ్ ఖైర్నారేను నాసిక్‌లోని కిలా కోర్టులో హాజరుపరిచారు. ఈ సాయంత్రం అతన్ని ఢిల్లీకి తరలిస్తారు. ఆ తర్వాత గురువారం నాడు అతన్ని సిబిఐ కోర్టు ముందు హాజరుపరుస్తారు. విచారణ సందర్భంగా, ఈ కేసులో ఇంకా ఎంతమందికి ప్రమేయం ఉందో తెలుసుకోవడానికి శుభమ్‌ను తమ అదుపులో ఉంచుకోవడం అత్యవసరమని సిబిఐ నాసిక్ కోర్టుకు తెలిపింది.ఈ వ్యవహారం వెలుగులోకి రాగానే, మే 3న పరీక్షను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) దానిని రద్దు చేసింది. పరీక్ష రద్దు దేశవ్యాప్తంగా వెంటనే ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాయి. ఈ నిర్ణయం కారణంగా పరీక్షకు హాజరైన లక్షలాది మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు.



# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మే 13 (వుదయం ప్రతినిధి):-**
జిల్లాలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియను పకడ్బందీగా, ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని శాంతినగర్, బొక్కలగూడ ప్రాంతాల్లో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న జనగణన సర్వేను పరిశీలించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు నమోదు చేస్తున్న సెన్సస్ నంబర్లు, వారు సిద్ధం చేసిన లేఅవుట్ మ్యాపులను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. సర్వే నమోదు ప్రక్రియ క్రమపద్ధతిలో సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బంది పనితీరును అభినందించారు. రేపటి నుండి హెచ్ఎల్ఓ (House Listing Operations) యాప్ ద్వారా డేటా నమోదు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో సాంకేతిక అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలందరూ జనగణన2027 లో భాగస్వాములు కావాలని కోరుతూ, ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో మాస్టర్ ట్రైనర్ శ్రీహరి బాబు, ఫీల్డ్ ట్రైనర్ సుజాత్ ఖాన్, మున్సిపల్ సిబ్బంది సాయి కృష్ణ, నవీన్ కుమార్, సంబంధిత సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేయాలి : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**మంచిర్యాల జిల్లా, మే 13, వుదయం:**
వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు త్వరితగతిన తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా రవాణా శాఖ అధికారి గోపి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ క్రాంతి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్టార్ 1, 2, 3, 4 లకు సంబంధించిన ట్రాన్స్పోర్ట్ గుత్తేదారులతో వరి ధాన్యం కొనుగోలు, ధాన్యం తరలింపు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 6 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని ఒక రోజులో దిగుమతి చేసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యం తరలిస్తున్న లారీలను అటవీ చెక్ పోస్ట్ ల వద్ద ఆపకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, లారీల డ్రైవర్లు, సిబ్బందికి రైస్ మిల్లుల వద్ద త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ లో నమోదు ప్రక్రియ త్వరగా చేపట్టాలని, కొనుగోలు చేసే సమయంలో తడిసిన ధాన్యాన్ని కేటాయించబడిన రైస్ మిల్లులకు మాత్రమే పంపించాలని, రైస్ మిల్లర్ల యజమానులు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులకు సహకరించాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట మండలం గుల్లకోట, మిట్టపల్లి లలో గల శివ సాయి, శ్రీరామచంద్ర, శ్రీరామ రైస్ మిల్లులను జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి బ్రహ్మారావు, లక్షెట్టిపేట మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ లతో కలిసి సందర్శించి రైస్ మిల్లు యజమానులకు పలు సూచనలు చేశారు. కేటాయించబడిన వరి ధాన్యం త్వరగా దిగుమతి చేసుకోవాలని, వరి ధాన్యం దిగుమతి విషయంలో ప్రభుత్వ నిబంధనలను పాటించాలని తెలిపారు. తదనంతరం కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గాను గోదాముగా మార్చిన దండేపల్లి మండలం లింగాపూర్ లో గల రామ్ లక్ష్మణ్ డిఫాల్టర్ రైస్ మిల్ ను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయబడి కేటాయించబడిన ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు.

## రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

### ధాన్యం బస్తాల దిగుమతి, మిల్లింగ్ ప్రక్రియల పరిశీలన



**నిజామాబాద్, మే 13, వుదయం:**
జిల్లా కేంద్రానికి సమీపంలో గల ఖానాపూర్ లోని రైస్ మిల్లులను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లక్ష్మీ బాలాజీ రైస్ మిల్లును, శ్రీ సిద్ధి రామేశ్వర ప్రైవేటు లిమిటెడ్ మిల్లులను సందర్శించారు. మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల ధాన్యం పంపించారు, వాటిని దిగుమతి చేసుకున్నారా, ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిపారు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఎలా భద్రపరుస్తున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. మిల్లుల వద్ద ఏమైనా తరుగు తీస్తున్నారా అని కలెక్టర్ ఆరా తీశారు. ఎక్కువగా ఏ రకం ధాన్యం వస్తోందని వివరాలు సేకరించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని వెంటదివెంట దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోకపోతే వర్షాల వల్ల తడిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. అవసరమైతే ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో మిల్లింగ్ చేయాలని హితవు పలికారు. ధాన్యం నిల్వలు, మిల్లింగ్ చేసిన బియ్యాన్ని జాగ్రత్తగా భద్రపర్చాలని సూచించారు. ధాన్యం నిల్వ చేసేందుకు సమీపంలోని రైతు వేదికలను వినియోగించుకోవాలని తెలిపారు. మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునే విషయంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్, రైస్ మిల్లుల నిర్వాహకులు వి. మోహన్ రెడ్డి, శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



## ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్యను పెంచాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



కోనరావుపేట మండలం మర్తనపేట, నాగారంలో కొనుగోలు కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, మే 13 (వుదయం ప్రతినిధి)**
కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్యను పెంచాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కోనరావుపేట మండలం మర్తనపేట, నాగారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని పరిశీలించారు. కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులు పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్య ను పెంచి వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వెంటనే వాహనాల సంఖ్య పెంచాలని, ధాన్యానికి అనుగుణంగా వాహనాలను సమకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. టార్పాలిన్లు అందుబాటులో పెట్టాలని, వాతావరణ శాఖ హెచ్చరికలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని సూచించారు. ధాన్యం తడవకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తనిఖీలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, మే 13 (వుదయం ప్రతినిధి):-**
సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, రైతుల నుండి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుత ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించాలని తెలిపారు. కేంద్రంలో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతులు తీసుకొచ్చిన మొక్కజొన్న నాణ్యత ప్రమాణాలను పరిశీలించి, తేమ శాతం నిబంధనల ప్రకారం ఉండేలా చూడాలని తెలిపారు. కొనుగోలు అనంతరం లిఫ్టింగ్ ప్రక్రియను కూడా వేగవంతం చేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ట్రాన్స్పోర్ట్కు సంబంధించి డీఎం మార్క్ఫెడ్ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తూ, రవాణా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 5 వేల క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించడం జరిగిందని, మిగిలిన స్టాక్ను వచ్చే 10 రోజుల్లో పూర్తి స్థాయిలో తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మొక్కజొన్న తూర్పార పట్టే విధానాన్ని పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్రక్రియ నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు, తూర్పార పట్టడం మరియు రవాణా ప్రక్రియలు సమన్వయంతో కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహకార అధికారి రామ్మోహన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

### కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**హాజీపూర్, మే 13 (వుదయం ప్రతినిధి):**
రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం హాజీపూర్ మండలంలోని ముల్కల్ల, నమ్నూర్, రాపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల వద్ద నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములలో భద్రపరచి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే వరి ధాన్యాన్ని తప్పనిసరిగా శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు తలెత్తకుండా, హమాలి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసారి ప్రభుత్వం రైతులు ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు అవకాశం కల్పించిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ ఫిలిం, సెన్సార్ బోర్డు మెంబర్ గా రాపాక ప్రవీణ్



**కరీంనగర్ మే13 (వుదయం ప్రతినిధి):**
కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్ ను సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ గా నియమిస్తున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ రీజినల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ గౌలికర్ గారు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ గారికి మరియు బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి మరియు పార్లమెంటు సభ్యులు బోయినపల్లి ప్రవీణ్ రావు గారికి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి గారికి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈనుగోండ నాగేశ్వర్ రెడ్డి గారికి జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి , గుర్రాల వెంకటరెడ్డి మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైతులను శత్రువుల్లా చూస్తారా సర్కార్‌పై కొప్పుల ఈశ్వర్ నిప్పులు

- మక్క, వరి ధాన్యం కేంద్రాల పరిశీలన
- 15 రోజులుగా కల్లాల్లోనే రైతులు
- కలెక్టర్‌తో ఫోన్‌లో ఆరా...
- మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్





**ధర్మపురి మే13 (వుదయం ప్రతినిధి):**
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను శత్రువుల్లా భావిస్తోంద ని,గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తడి సిన ధాన్యాన్ని కూడా కొను గోలు చేసి ఆదుకున్నామని,కానీ నేడు కల్లాల్లో రైతులు కన్నీరు పెడుతుంటే ఈ ప్రభుత్వానికి కనబడటం లేదా అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మండ లం దొంతాపూర్,మగ్గిడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన మక్క,వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సంద ర్భంగా రైతులు పడుతున్న ఇబ్బం దులను చూసి చలించిపోయిన ఆయన,అక్కడికక్కడే జిల్లా కలె క్టర్‌కు ఫోన్ చేసి నిలదీశారు. జిల్లా లో ఈ ఏడాది వరితో,మొక్కజొ న్న పంటలు విరివిగా పండినాయ ని తెలిసినా,ప్రభుత్వం ముందస్తు గా గోదాములు,కొనుగోలు కేంద్రా లు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైందని కొప్పుల ఆరోపిం చారు.15 రోజులుగా రైతులు ధాన్యం బస్తాలు పోసి ఎదురుచూ స్తున్నా,ఒక్క లారీ కూడా సరిగా రాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు 2.5 నుంచి 5 కేజీల వరకు సంచికీ అదనంగా కోత విధిస్తున్నారని, ఇది రైతుల రక్తాన్ని తాగడమేనని మండిపడ్డారు.కలెక్టర్ ఏర్పాట్లు చేస్తామని చెబుతున్నా, క్షేత్రస్థా యిలో వేలాది బస్తాలు పేరుకు పోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. మంత్రి అడ్లూరిఎక్కడ ఆఫీసుల్లో కూర్చుంటే సమస్యలు తీరవు, మంత్రిపై కొప్పుల ఈశ్వర్ నిప్పులు చెరిగారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద చల్లడానికి కల్లాల చుట్టూ తిరిగిన నాయకులు,ఇప్పుడు రైతులు ఇన్ని కష్టాలు పడుతుంటే ఎందుకు రావడం లేదు అని ప్రశ్నించారు. వర్షాలు కురిసి ధాన్యం తడిసిపోతే బాధ్యత ఎవరిదని, ధర్మపురి నుంచే కాకుండా రాష్ట్రమంతా ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులు, పాలకులు ఏసీ గదుల్లో,ఆఫీసు ల్లో కూర్చోవడం మానేసి వెంటనే మక్క,వరి కేంద్రాలకు రావాలని కొప్పుల డిమాండ్ చేశారు. తక్షణ మే సరిపడా లారీలను పంపి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు అండగా నిలవా లని,లేనిపక్షంలో బీఆర్ఎస్ తర పున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం సమిష్టిగా కృషి చేద్దాం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ధర్మపురి,మే 13 (వుదయం ప్రతినిధి):**
విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రజాప్రతినిధులు, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాల ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తు న్న 99 రోజుల కార్యక్రమం లో భాగంగా బుధవారం పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో సర్పంచ్‌లు,కౌన్సి లర్లకు నిర్వహించిన ప్రత్యేక అవగా హన సదస్సుకు ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యం త ప్రాధాన్యత ఇస్తోందని,ప్రభు త్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య తో పాటు మెరుగైన మౌలిక వస తుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.గ్రామ స్థాయిలో పాఠశా లల అభివృద్ధిలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలి.పాఠశాలల్లో విద్యార్థు ల నమోదు పెంపు, డ్రాప్అవు ట్‌ల నివారణతో పాటు పరిశుభ్రత, తాగునీరు,మరుగుదొడ్ల సౌకర్యా లపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఉపాధ్యాయు లు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా నిలుస్తాయి.నేటి విద్యార్థులే రేపటి పౌరులని, వారి భవిష్యత్ బాగుంటేనే రాష్ట్రం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదన పు కలెక్టర్ బి.రాజగౌడ్,జిల్లా గ్రంథాలయం చైర్మన్ సంఘనబట్ల. దినేష్, మున్సిపల్ చైర్మన్ వేముల.నాగలక్ష్మి, ఎఎంసి చైర్మన్ చిలుముల.లావణ్య, ఎఎంసి వైస్ చైర్మన్ సంగ.నరసింహు లు, డీఈఓ రాము, ఎంఈఓ సీతాలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆయా గ్రామాల సర్పంచ్ లుమున్సిపల్ కౌన్సిలర్లు, అన్ని శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోంది

## రైతుల సమస్యలపై నిర్లక్ష్యం సహించం : ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**పెద్దపల్లి, మే 13: (వుదయం ప్రతినిధి):**
తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. మంగళవారం పెద్దపల్లి అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ నుంచి కేంద్రానికి అధికంగా పన్నులు వెళ్తున్నప్పటికీ, రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో కోతలు విధిస్తున్నారని విమర్శించారు. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయిస్తూ తెలంగాణను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.డిలిమిటేషన్ అంశంలో తెలంగాణకు అన్యాయం జరిగేలా కేంద్రం వ్యవహరిస్తోందని, రాష్ట్ర ప్రజల తరఫున దీనిని తీవ్రంగా వ్యతిరేకించామని పేర్కొన్నారు. తెలంగాణకు రావాల్సిన సెమీకండక్టర్ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌కు తరలించడం అ న్యా య మ న్నా రు . రా మ గుం డం ఎరువుల కర్మాగారంలో యూరియా ఉత్పత్తిపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, కావాలనే యూరియా కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో కూడా రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.మంచిర్యాల జిల్లాకు సంబంధించిన ధాన్యం కొనుగోలులో పెద్దపల్లి జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదాముల్లో నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ రైతుల ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం లేదన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం ప్రశ్నిస్తానని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. అధికారులు రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సూచించారు.బండి భగీరథ్ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుంటుందని పేర్కొన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉ ప యో గిం చు కుం టు న్నా య ని విమర్శించారు.

## ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలే లక్ష్యం : ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**ఆసిఫాబాద్( వుదయం ప్రతినిధి )**
ఆసిఫాబాద్ ఉట్నూరు ప్రధాన రహదారిపై గత రెండేళ్లుగా నిలిచిపోయిన ఘాట్ రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు.కెరమెరి ఘాట్ నుంచి టింకపల్లి వరకు దెబ్బతిన్న రహదారితో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించి అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో పవర్‌గూడ నుంచి టింకపల్లి వరకు ప్యాచ్ వర్క్ పనులు బుధవారం ప్రారంభం కావడంతో ఎమ్మెల్యే పనులను పరిశీలించి నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన, మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఘాట్ రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరికీ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం అని ఎమ్మెల్యే తెలిపారు.పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారానికి కాంట్రాక్టర్ ముంతాజ్‌కు భరోసా కల్పించారు.నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో పనులు తిరిగి ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె వెంట బిఆర్ఎస్ నాయకురాలు మార్సుకోల సరస్వతి ఉన్నారు.

## చెరువు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు



**కాగజ్నగర్ ( వుదయం ప్రతినిధి)**
కాగజ్ నగర్ మండలంలోని బురుదగూడ చెరువు రెండు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలకు కట్ట తెగిపోయి ఆయకట్టుకు నీరు అందించలేని పరిస్థితి ఉన్నది. సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు చొరవ తీసుకొని రూ.35 లక్షల ఓ.ఎండ్.ఎం నిధులు మంజూరు చేయించడంతో ఈరోజు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు వర్షాకాలం మొదలయ్యే లోపు చెరువు పునరుద్ధరణ పనులు పూర్తిచేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌత్రే లక్ష్మి, ఇరిగేషన్ ఈ. ఈ ప్రభాకర్, డి.ఈ తిరుపతి, ఏ.ఈ స్వామి, నాయకులు గోపాల్, నికోడె ప్రభాకర్, డోంగ్రే కార్తీక్, డోంగ్రే భరత్, కొట్రంగి బాబు రావు, జీల్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**
**నారాయణపేట మే13 (వుదయం ప్రతినిధి)**

పారిశుద్ధ్యం, తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పుర వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా బుధవారం కలెక్టర్ మున్సిపాలిటీ లోని ఆరో వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ ను చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ , వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో గల బీసీ కాలనీ లో పర్యటించిన కలెక్టర్ అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు వాసుల సమస్యలపై ఆమె సానుకూలంగా స్పందించారు. తమకు మరుగుదొడ్లు లేవని పలువురు మహిళలు కలెక్టర్ కు విన్నవించడంతో స్పందించిన ఆమె స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించి అనుమతి తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శంకర్, ఇంజినీర్, మున్సిపాలిటీ కి చెందిన జవాన్లు, నీటి సరఫరా, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీసు భద్రత జిల్లా అదనపు ఎస్పీ

**వనపర్తి మే 13 (వుదయం ప్రతినిధి)**
రాజేష్ మీనా , ఐపీఎస్.,
•పరీక్షా కేంద్రాల వద్ద BNSS163 (144 సెక్షన్) అమలు
•జిరాక్స్ సెంటర్ల మూసివేయాలని అదనపు ఎస్పీ ఆదేశాలు



విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లాలోని అన్ని ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా, ఐపీఎస్., గారు తెలిపారు.

వనపర్తి, మే 12:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మే నెల 13వ తేది నుండి 21వ తేది వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల సందర్భంగా, వనపర్తి జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు పరిరక్షించేందుకు BNSS-2023 సెక్షన్ 163 (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.వనపర్తి జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధం. ఈ ఆంక్షలు ఈ నెల 13వ తేది నుండి 21వ తేది వరకు వరకు సెక్షన్ 163 అమల్లో ఉంటుందని తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు పరీక్షల సమయంలో తప్పనిసరిగా మూసివేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు.

జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ అధికారులకు పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ వాచీలు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావద్దని సూచించారు.

పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్లు మరియు పోలీస్ సిబ్బంది మొబైల్ ఫోన్ల వినియోగాన్ని కూడా నిషేధించారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లా పోలీస్ శాఖ సంపూర్ణ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పరీక్షలపారదర్శకతనుకాపాడేందుకు ప్రజలు మరియు తల్లిదండ్రులు పోలీసుశాఖకు సహకరించాలని జిల్లా అదనపు ఎస్పీ గారు కోరారు.

## బీడీ కార్మికుల వేతనం వెంటనే పెంచాలి



**మరికల్ మే 13 (వు దయం ప్రతినిధి)**

ధన్వాడ మండల కేంద్రంలోని బుధవారం బీడీ కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు నాయకుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు మరియు పాత వేతనాలు ఒప్పందం పూర్తి అయిన కొత్త వేతనాలు యజమాన్యం పెంచడం లేదని ఆయన అన్నారు కి 400 రూపాయలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు ఒకవేళ స్పందించకపోతే ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బీడీ కార్మికుల సంఘం అధ్యక్షులు బాలప్ప గజం మణెమ్మ బొబ్బిలి అనురాధతో పాటు కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డును సందర్శించిన రెవెన్యూ అదనపు కలెక్టర్



**మహబూబ్ నగర్ మే13 (వుదయం ప్రతినిధి)**

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ బుధవారం జడ్చర్ల పట్టణంలో పత్తి మార్కెట్ యార్డ్ ను సందర్శించారు. మార్కెట్ యార్డ్ లో మొక్క జొన్న కొనుగోలు పరిశీలించారు.కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు. రైతులు,అధికారులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా మొక్క జొన్న కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని,రైతులు ఆందోళన చెంద వద్దని అన్నారు.మార్కెట్ కు వచ్చిన మొక్క జొన్న కొనుగోలు చేయటం తో పాటు కొనుగోలు చేసిన మొక్క జొన్న వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అదనపు కలెక్టర్ వెంట జిల్లా సహకార అధికారి కృష్ణ,జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాలమణి,తహశీల్దార్ నర్సింగ రావు,తదితరులు ఉన్నారు.

## బడి బాగుపడాలంటే అందరి సహకారం ఉండాల్సిందే!

**నాగర్‌కర్నూల్‌లో విద్యాభివృద్ధిపై అవగాహన సదస్సులో, పాఠశాలల పర్యవేక్షణలో ప్రజాప్రతినిధులు చురుకుగా ఉండాలి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది, ఎమ్మెల్సీ కూచ్చుకుళ్ళ దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ మే 13 (వుదయం ప్రతినిధి)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామ సర్పంచులు, నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ సభ్యులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని డీ.కేఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో, విద్యా వారోత్సవాల్లో భాగంగా, విద్యాభివృద్ధిపై అవగాహన సదస్సులో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, శాసన మండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమాన్ని సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ...., రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మహిళా సంఘాల నాయకులు చొరవ చూపినప్పుడే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని జిల్లా కలెక్టర్ అభిప్రాయపడ్డారు.ప్రతి సర్పంచ్, వార్డు సభ్యుడు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను తరచూ సందర్శించి విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాల మానేసే విద్యార్థుల సంఖ్య తగ్గించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధి ద్వారా మాత్రమే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామ పరిధిలో ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల పట్ల పూర్తి అవగాహన కల్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలో నమోదు శాతాన్ని పెంచేలా సర్పంచులు కృషి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ...., గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల పెంపుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని,

అందుకు అనుగుణంగా సర్పంచులు పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయనతెలిపారు.ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామాల్లో తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా అవగాహన కార్యక్రమాలు ఉచిత నోట్ పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు అందజేయడంతోపాటు,విద్యార్థుల అభ్యున్నతికి చేపడుతున్న చర్యలు, పదో తరగతిలో సాధించిన ఫలితాలపై వివరించారు.

విద్యార్థుల నమోదు పెంపు, మధ్యాహ్న భోజన పథకం అమలు, డిజిటల్ తరగతులు, పాఠశాలల ఆధునీకరణ వంటి అంశాలపై చర్చించారు.ఈ సదస్సులో పాల్గొన్న సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు తమ గ్రామాలు, వార్డుల పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, నాగర్ కర్నూల్ మండల విద్యాధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, వెంకటేశ్వర్ల శెట్టి, నియోజకవర్గ పరిధిలోని మండలాల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు...

**కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బురద జల్లే ప్రయత్నం**
**ఎమ్మెల్యే పై అనుచిత వాక్యాలు చేస్తే సహించేదే లేదు..**
**తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు**




**తాండూర్ వుదయం ప్రతినిధి మే 13:**

తాండూర్ టిఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడడం మంచి పద్ధతి కాదని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వృధా దల్లే ప్రయత్నం మానుకోవాలని టిఆర్ఎస్ పార్టీ నాయకులకు ఇట్టబోధ చేసిన తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నరసింహులు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ చౌరస్తాలో రైతు నుండి వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఫోటోలకే పూజలిచ్చినట్లు పత్రికల్లో తప్పుడు ప్రచారం చేయరాదని తాండూరు ఎమ్మెల్యే బుయాని మనోహర్ రెడ్డి చేతుల మీదుగా డీసీఎంఎస్ ఆధ్వర్యంలో తాండూరు మండల పరిధిలోని చెంగోల్ ,బెల్కటూర్ ,గోనూర్ గ్రామాలలో రైతు 200500 కింటల్లా వరి ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేయడం జరిగిందని టిఆర్ఎస్ నాయకులకు డీసీఎంఎస్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించుకోవాలని సూచించారు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు తాండూరు నియోజకవర్గంలో 8 వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు రైతులు వారు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు టిఆర్ఎస్ నాయకులు చెప్పేదొకటి చేసేది ఒకటని రోజుకొక మాట రోజుకొక రూపం దాలుస్తున్నారని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహలక్ష్మి పథకం కింద 200 యూనిట్లు ఉచితంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు.

రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు గ్రామాలలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో సిసి రోడ్లు మురుగు కాలువలు అంగన్వాడి భవనాలు ప్రభుత్వ పాఠశాల పహారి గోడలు నిర్మించడం కనబడడం లేదని టీఆర్ఎస్ నాయకులకు గుర్తు చేశారు టిఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా మేలుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## హెల్మెట్ లేకుంటే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు నో ఎంట్రీ'



**గద్వాల మే 13 (వుదయం ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లాలోని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు వచ్చే ద్విచక్ర వాహనదారులకు పోలీసులు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఇకపై హెల్మెట్ ధరించి వచ్చిన వారికే కార్యాలయాల్లో ప్రవేశం కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రతిరోజూ కార్యాలయాలకు వస్తుండటంతో ట్రాఫిక్ నిబంధనల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే కార్యాలయాల వద్దే అడ్డుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

## సదాశివపేటలో రూ.12.80 కోట్ల పనులకు శంకుస్థాపన



**సంగారెడ్డి వుదయం**

సదాశివపేట మున్సిపాలిటీలో TUFIDC కింద రూ.12 కోట్ల 80 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు TGIIC చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ధికారంలోకి వచ్చిన తర్వాత సదాశివపేట మున్సిపాలిటీకి కొత్తగా నిధులు రాలేదని విమర్శించారు. 2018లో గత ప్రభుత్వం TUFIDC ద్వారా మంజూరు చేసిన పనులను 2023లో కొంత మార్పులతో అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం మోడిఫికేషన్ చేసి పనులు ప్రారంభించిందన్నారు. గతంలో మూడు సార్లు టెండర్లు పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. ఇకపై పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కాంట్రాక్టర్లు బాధ్యతగా పనులు పూర్తి చేయాలని కోరారు.అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, SDFలో రద్దైన పనులను తిరిగి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగోనిపల్లి ప్యాడీ కొనుగోలు కేంద్రంలో నిర్లక్ష్యం

**అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**గద్వాల మే 13 (వుదయం ప్రతినిధి)**



ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సంబంధిత అధికారుల నిర్లక్ష్యం తగదని, అలసత్వం చూపే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గద్వాల మండలం తెలుగోనిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంను బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో ఇంచార్జ్ గైర్హాజరు కావడం, మహిళా సంఘాల సభ్యులు లేకపోవడం, రైతులు ఎండలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తూకాలు, లిఫ్టింగ్ పనులు సరైన పర్యవేక్షణ లేకుండా కొనసాగుతున్నాయని గమనించిన కలెక్టర్ రైతులకు ఇబ్బందులు కలిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రంలో ఐకేపీ మహిళా సంఘాల స్థానంలో ఇతరులు వ్యవహారాలు నిర్వహించడం గమనించి తీవ్రంగా మందలించారు. మహిళా సంఘాల సభ్యులే కొనుగోలు కేంద్రంలో నిర్వహించాలని స్పష్టం చేశారు. రిజిస్టర్లు, ఇతర రికార్డులను 15 రోజులుగా సరిగ్గా నమోదు చేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్, అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలో సరైన నిర్వహణ లేకపోవడం, సిబ్బంది అందుబాటులో లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా భావించిన కలెక్టర్ బాధ్యులపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రొక్యూర్మెంట్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని, రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు వేగవంతం పెంచాలి డిప్యూటీ తాహసిల్దార్ రమ్యశ్రీ



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండలం కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం కంటాలు వేగవంతం చేయాలని డిప్యూటీ తాహసిల్దార్ రమ్యశ్రీ అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలోని శ్రీసదాశివ రైస్ మిల్లు సందర్శించి ధాన్యం లారీలను త్వరితగతిన ఖాళీ చేసి కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకం ఆలస్యం కాకుండా రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.

ఈ కార్యక్రమంలో రైస్ మిల్ నిర్వాహకులు రాజి రెడ్డి, నవీన్ రెడ్డి, లు ఉన్నారు.

## ఇంటింటికీ చదువు.. ఊరంతా వెలుగు

**- మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం**
**- కమిషనర్ అశ్రిత్ కుమార్**
**సిద్దిపేట, మే 13 ( వుదయం ):**



మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమనికమిషనర్ అశ్రిత్కుమార్ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో నిర్వహించిన ఉల్లాస్ (సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన)అక్షరాస్యతకార్యక్రమానికి సంబంధించిన సంఘ స్థాయి సమాఖ్య పరిశీలకులు, వనరుల వ్యక్తుల ఒక్కరోజు శిక్షణా తరగతులను మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చదువుకునే అవకాశం లభించని 15 సంవత్సరాలు పైబడిన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సిద్దిపేట పట్టణ పరిధిలో మహిళా సంఘాల్లో దాదాపు 1300 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారికి స్వచ్ఛందంగా విద్యాబోధన అందించేందుకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రతి వనరుల వ్యక్తి, పరిశీలకుడు ఒక్కొక్కరు కనీసం 10 మంది నిరక్షరాస్యులకు చదువు చెప్పే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇంటి మహిళ అక్షరాస్యురాలైతే కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. చదవడం, రాయడం నేర్పించి సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యమన్నారు.ఉల్లాస్ కార్యక్రమం కేవలం అక్షరాస్యతకు పరిమితం కాదని, మహిళల సాధికారతకు దోహదపడే ఉద్యమమని తెలిపారు. చదువు ద్వారా మహిళల జీవనోపాధి, ఆత్మవిశ్వాసం, సామాజిక స్థితిగతుల్లో గణనీయమైన మార్పు వస్తుందని పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో దశలవారీగా అమలు చేస్తున్న ఈ పథకంలో మొదటి దశలో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా చేయడం, రెండో దశలో మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తించి స్వేచ్ఛా విద్యా విధానం ద్వారా పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదేవిధంగా వయోజన మహిళలకు నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ సమన్వయకర్త హన్మంత్ రెడ్డి, రెవెన్యూ అధికారి శ్రీకాంత్, విద్యాశాఖకు చెందిన శ్రీనివాస్, సమన్వయ అధికారులు రేణుక, జ్యోతి, సంఘ స్థాయి సమాఖ్య ప్రతినిధులు, వనరుల వ్యక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 1వ తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**గద్వాల మే 13 (వుదయం ప్రతినిధి)**



హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (రామంతపూర్)లో 1వ తరగతి ప్రవేశాల కోసం షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ, విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు.

జోగులాంబ గద్వాల జిల్లాకు ఒక సీటు కేటాయించ బడినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 0106 2019 నుండి 31052020 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు.దరఖాస్తుదారుల కుల ధ్రువీకరణ పత్రం విద్యార్థి పేరుపై ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించరాదని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ నుండి 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అభ్యర్థుల ఎంపిక జూన్ 1వ తేదీన కలెక్టర్ కార్యాలయం నందు లక్కీ డిప్ విధానంలో నిర్వహించబడుతుందని తెలిపారు.

దరఖాస్తు ఫారాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం, ఐడీఓసీ కాంప్లెక్స్, కలెక్టరేట్ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు.

ఇతర వివరాలకోసం 9491767689, 7981488878 నంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు.

## జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలి





**హైదరాబాద్ వుదయం ప్రతినిధి మే 13:**

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రారంభమైన జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్ లోని మీడియా అకాడమీలో జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ళస్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపుతోందని అన్నారు. మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈనెల 21న జరుగనున్న కేబినెట్ సమావేశం నాటికి హైదరాబాద్ లో ఉన్న అన్ని సొసైటీల పూర్తి వివరాలను, జర్నలిస్టుల సంఖ్యతో కూడిన నివేదికను తయారు చేయాలని అన్నారు. ఇందుకు అన్ని సొసైటీలు సమిష్టిగా సహకరించాలని ఆయన కోరారు. అర్హులైన జర్నలిస్టులను మాత్రమే జాబితాలో చేర్చాలని ఆయన సొసైటీల ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఈ సొసైటీని కూడా పరిగణలోకి తీసుకొని జేఏసీలో చేర్చారు. అదేవిధంగా మహాత్మగాంధీ జర్నలిస్ట్స్ సొసైటీని కూడా చేర్చారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ లు తమ సొసైటీ సభ్యుల జాబితా ను సమర్పించారు. ఈ సమావేశంలో ఐఅండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు

# బడిని గుడిలా భావించి బలోపేతం చేయాలి : ఎంపీ కావ్య

**గ్రామస్థాయిలో విద్యా చైతన్యం రావాలి : కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సులో పాల్గొన్న ఎంపీ కావ్య, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**




**హనుమకొండ, మే 13 (వుదయం ప్రతినిధి) :**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని, బడిని గుడిలా భావించి బాధ్యతగా చూసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా బుధవారం కలెక్టరేట్ లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ప్రభుత్వ బడులే ప్రతిభకు కేరాఫ్:ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు చొరవ చూపాలని, 'బడిబాట' ద్వారా ప్రవేశాలను పెంచాలని కోరారు. ముఖ్యంగా బాలికల విద్యపై దృష్టి సారించాలని, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాల వంటి సామాజిక రుగ్మతలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో డ్రాప్‌ఔట్స్ (బడి మానేసిన వారు) లేకుండా చూడటంలో సర్పంచ్‌ల పాత్ర కీలకమన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, తాగునీరు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు', 'యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూషన్స్' వంటి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 11 వేల మంది ఉపాధ్యాయుల నియామకం.డిజిటల్ లెర్నింగ్, ఏఐ ఆధారిత బోధనకు ప్రాధాన్యత,వారోత్సవాల ద్వారా గ్రామస్థాయిలో విద్యా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో డీఈఓ గిరిరాజు బాబు, డీడబ్ల్యూఓ విశ్వజ, వివిధ మండలాల ఎంఈవోలు, సర్పంచ్‌లు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధర బోనస్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ వైస్ చైర్మన్ హరిబాబు.**



**ఖానాపురం, మే 13 (వుదయం ప్రతినిధి):**

రైతులు పండించిన వరి ధాన్యముకు ప్రభుత్వ మద్దతు ధర బోనస్ తో కలిపి వరి ధాన్యమును ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ఇంచార్జ్ లు కొనుగోలు చేస్తారని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు మండల రైతులకు ప్రజలకు తెలిపారు. మండల కేంద్రంలోని బుధరావుపేట గ్రామంలోని శ్రీ ఆంజనేయ పొదుపు పరపతి అండ్ మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని డివిజన్ ఆత్మ అధ్యక్షుడు యర్ల బిక్షంరెడ్డి, గ్రామ సర్పంచ్ పెసరు రాణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు లింగిడి వెంకటేశ్వర్లు, సంఘం అధ్యక్షుడు గిరగాని నరసయ్య, ఉపాధ్యక్షుడు సోమ వెంకటరెడ్డి, కార్యదర్శి చెడిపాక ఉపేందర్ తో కలిసి ఏఎంసి వైస్ చైర్మన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యమును కొనుగోలు కేంద్రల వద్దకు తీసుకువచ్చే ముందు పంట పొలంలోనే ధాన్యమును ఆరబెట్టుకొని చెత్తా చెదారం తాలు పోల్లు మట్టి పేల్లలు లేకుండా శుభ్రం చేసుకొని దాన్యమును కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువస్తే ఆయా కొనుగోలు ఇన్చార్జిలు ధాన్యమును మ్యాచర్ చూసుకొని వెనువెంటనే కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేస్తారని రైతులకు తెలుపుతూ ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ కు 2389 రూపాయలు, కామన్ గ్రేడ్ కు 2369 రూపాయలతో పాటు బోనస్ 500 కలిపి కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేస్తారని తెలుపుతూ, ప్రభుత్వ నియమ నిబంధనలను రైతులు తప్పక పాటించాలని రైతులకు ఏఎంసి వైస్ చైర్మన్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఈవో అంకుస్ వలి, సంఘం బాధ్యులు సింగు రాజయ్య, కొండ్ల మధు, నారగాని సమ్మయ్య, చెడిపాక యాకయ్య, చెడిపాక రామస్వామి, నాయకులు బిక్కీ మురళి, పొదుపుగంటి మధుసూదన్ రావు, పసునూరి పులి వెంకన్న, బండి ప్రభాకర్, ఎస్కే అల్లావుద్దీన్, సలీం పాషా, వెంకటనారాయణ, శ్రీను, జానయ్య, బీమ్ దాస్, భగవంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మే 24న కంపేటి రాజయ్య సంతాప సభ

**జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు**



**భూపాలపల్లి, మే 13 (వుదయం ప్రతినిధి):**

సిఐటియు జిల్లా మాజీ అధ్యక్షులు, పోరాట యోధుడు కామ్రేడ్ కంపేటి రాజయ్య సంతాప సభను ఈ నెల 24న భూపాలపల్లి పట్టణంలో నిర్వహించనున్నట్లు సిఐటియు రాష్ట్ర నేతలు వెల్లడించారు. బుధవారం భూపాలపల్లిలోని శ్రామిక భవన్‌లో జిల్లా అధ్యక్షులు బందు సాయిలు అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద నరసింహారావు, తుమ్మల రాజారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజయ్య చేసిన సేవలను కొనియాడారు. కార్మిక పక్షపాతి, సింగరేణి బొగ్గు గని కార్మికుల సమస్యలపై, ముఖ్యంగా కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ హక్కుల కోసం ఆయన రాజీలేని పోరాటం చేశారు. ప్రజా ఉద్యమాలు, భూమి కోసం, భుక్తి కోసం, నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం భూపాలపల్లి కేంద్రంగా సమరశీల పోరాటాలు నిర్వహించి, అనేక కేసులను ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకోవడం, కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్‌లను రద్దు చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.రాజయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి, ఈ నెల 24న జరిగే సంతాప సభకు సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు గుర్రం దేవేందర్, సిహెచ్ రవికుమార్, మేకల మహేందర్, కొండ లక్ష్మి, విజయలక్ష్మి, బండారి బాబు మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతా మా ఇష్టం..!

**నిబంధనలతో మాకు సంబంధమేంటి.**




**మహాదేవపూర్ మే 13 (వుదయం ప్రతినిధి)**

అంతా మా ఇష్టం నిబంధనలతో మాకేం పని అంటూ ఇసుక క్వారీల్లో నిబంధనలకు పాతర పెట్టి అక్రమ ఇసుక లారీల జాతర సాగిస్తున్నారు క్వారీ యజమానులు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో ఏర్పాటైన ఇసుక క్వారీల్లో అక్రమార్జనే ధ్యేయంగా తెల్లవారి నుండి అర్ధరాత్రి వరకు ఇసుక రకాన్ని బట్టి రేటు కేటాయిస్తూ దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.క్వారీ యజమానులు,సూపర్వైజర్ల ఇష్టారాజ్యం నడిపిస్తూ సన్న ఇసుక పేరుతో 2000,లోడింగ్ ఛార్జీ పేరుతో 1500 నుండి 1800 వరకు ,ఇదే కాకుండా అదనంగా కాంట,జెసి బి, సీరియల్ పేరుతో వందలాది రూపాయలు వసూలు చేస్తూ ఇసుక రవాణా సాగిస్తున్నారు.దీన్ని నియంత్రించాల్సిన అధికారులు కళ్ళు మూసుకోవడం తో వేల టన్నుల ఇసుక పక్కదారి పడుతుంది. దోచుకున్న వారికి దోచుకునే అంత చందంగా కళ్ళముందే అక్రమ దందా సాగుతున్న పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇదే కాకుండా కాంట్రాక్టర్లు సూపర్వైజర్లు తమ సొంత లారీలను ఉపయోగిస్తూ అధికలోడు క్వాలిటీ ఇసుకను అర్ధరాత్రి వేళ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తాముడిడి కట్టుకొని వచ్చి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని లారీ ఓనర్లు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా నిబంధనలకు అనుగుణంగా సమయానుకూలంగా లోడింగ్ ప్రక్రియ నిలిపివేయాల్సి ఉంటుంది కానీ ఇసుక అక్రమ రవాణా సాగించడానికి సమయపాలన కానీ నిబంధనలు గాని పనిచేయడం లేదని ఇంత జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై కంచె చేను మేస్తున్న చందంగా సంబంధిత అధికారులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ విషయంపై టీజీఎండిసి పిఓ ను వుదయం ప్రతినిధి వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



**భూపాలపల్లి మే 13(వుదయం విలేకరి)**

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు భూపాలపల్లి రూరల్, అర్బన్ ఘనపూర్ మండలాలకు చెందిన సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి అర్బన్ రూరల్ కు చెందిన మొత్తం 46 చెక్కులను రూ.18,45,700 విలువతోపాటు ఘనపూర్ మండలానికి చెందిన 31 చెక్కులను రూ.9,74,300 విలువల పంపిణీ చేశారు. అదేవిధంగా 23వ వార్డుకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమం, వైద్య సేవలు మరియు పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు. సీఎం ఆర్ ఎఫ్ ద్వారా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే గ్రామాల ప్రగతి సాధ్యం




**మహాదేవపూర్ మే 13 (వుదయం ప్రతినిధి)**

విద్య ద్వారానే గ్రామాల ప్రగతి సాధ్యం అని అన్నారం గ్రామ సర్పంచ్ నీర్ల ప్రభాకర్, మద్దులపల్లి సర్పంచ్ వేల్పుల సరిత, పలుగుల సర్పంచ్ విజయలక్ష్మి లు అన్నారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం మూడో రోజు మండలంలోని సర్పంచులకు నమోదు ప్రక్రియ గురించి నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా మహాదేవపూర్ మండల కేంద్రంలోని వివిధ గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు మహాదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా వ్యవస్థ పురోగతి, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్య ప్రాధాన్యతపై చర్చించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో మంత్రి 2008 సంవత్సరంలో ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గ్రామీణ విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా సర్పంచ్‌లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.ఈసందర్భంగా గ్రామల సర్పంచ్ లు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి మరియు సమాజ ప్రగతి సాధించాలంటే విద్యే ప్రధాన మార్గమని అన్నారు.

ప్రతి గ్రామంలోని సర్పంచ్‌లు తమ గ్రామాల విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరేలా గ్రామ సభల్లో తీర్మానాలు చేసి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మెట్పల్లి ఉప సర్పంచ్ రాజుతో పాటు వివిధ గ్రామపంచాయతీల ప్రజాప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు

# ఘనంగా ఓంకార్ శత జయంతి ఉత్సవాలు




**ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ.**

**నర్సంపేట వుదయం ప్రతినిధి మే 13.**

అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతి ముగింపు కార్యక్రమాల సందర్భంగా నర్సంపేటలో ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. నెక్కొండ రోడ్డు సర్కిల్ నుంచి సిటిజన్ క్లబ్ వరకు జరిగిన ర్యాలీలో కోలాటాలు, డప్పు బృందాల కళారూపాలు ఆకట్టుకున్నాయి. సభలో ఎంసిపిఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్‌ఓంకార్ మాట్లాడుతూ కమ్యూనిస్టు, సామాజిక శక్తుల ఐక్యతే దోపిడి విముక్తికి మార్గమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, మత వైరుధ్యాలను పెంచుతున్నాయని విమర్శించారు. వివిధ వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ మద్దికాయల ఓంకార్ పీడిత ప్రజల కోసం పోరాడిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు లాల్ నీల్ ఐక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాట యోధుల త్యాగాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని, మద్దికాయల ఓంకార్ పేరుతో నర్సంపేటలో మెడికల్ కాలేజీ, స్టేడియం, ప్రధాన రహదారికి నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, గోనె కుమారస్వామి, వస్కుల మట్టయ్య, వరికుప్పల వెంకన్న, ఎన్ రెడ్డి హంసరెడ్డి, కన్నం వెంకన్న, మంద రవి, ఎస్.కె నజీర్, తుకారాం నాయక్, గేయ రచయిత యోచన, రాష్ట్ర కమిటీ సభ్యులు వంగల రాగసుధ, కుసుంబా బాబురావు, నర్ర ప్రతాప్, కనకం సంధ్య, గుండెబోయిన చంద్రయ్య, మైదం శెట్టి రమేష్, తుడుం అనిల్ కుమార్, కంచ వెంకన్న, మాలోతు జబ్బర్ నాయక్, కర్రోళ్ల శ్రీనివాస్, తాండ్ర కళావతి, నీల రవీందర్, కర్ర రాజిరెడ్డి, గడ్డం నాగార్జున, పల్లె మురళి, మాస్ సావిత్రి, మహమ్మద్ రాజా సాహెబ్, మాలోతు సాగర్, కొత్తకొండ రాజమౌళి,మాలి బాబురావు, ముక్కెర రామస్వామి, కేశెట్టి సదానందం, సింగతి మల్లికార్జున్, జన్ను రమేష్, పాల్గొన్నారు.

# రోడ్డు ఆక్రమణ తొలగింపు

**వుదయం కథనానికి స్పందన**



**సుబేదారి, మే13 (వుదయం విలేకరి):**

హనుమకొండ 60వ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేస్1లోని ఫారెస్టుఆఫీస్ ఎదురుగా ఉన్న రోడ్డును ఓ వ్యక్తి ఆక్రమించి రాయి, ఇసుక వేసి రాకపోకలకు అంతరాయం కలిగించాడు. ఈ విషయాన్ని 'రోడ్డు ఆక్రమణను అరికట్టాలి' అనే శీర్షికతో ఈ నెల 8న వుదయంలో కథనం ప్రచురితమైంది. కాలనీ వాసులు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తోపాటు మునిసిపల్ అధికారులను కలిసి వినతి పత్రాలను సమర్పించి సమస్యను విన్నవించారు. దీనికి స్పందించిన వరంగల్ మహా నగర పాలక సంస్థ ఏసీపీ పర్యవేక్షణలో సుబేదారి సీఐ మేకల రంజిత్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది క్షేత్రస్థాయిలో సందర్శించారు. రోడ్డును ఆక్రమించి అడ్డంగా పోసిన ఇసుక, కంకర, రాయిని ప్రొక్లెయినర్ సహాయం తో తొలగించారు. దీంతో రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా టీచర్స్ కాలనీ ఫేస్ 1 అధ్యక్షుడు పింగిళి రాంరెడ్డి, కాలనీ ప్రతినిధులు భూపాల్ రెడ్డి, మేరుగు శివ, సురేష్, లక్ష్మణ్, సాంబయ్య మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం కాలనీలోని రోడ్డు 40 ఫీట్లు ఉందని అన్నారు. దీన్ని ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కాలనీ ప్రతినిధులు రిటైర్డ్ ఎస్పి శేషు రామ్ నాయక్, నల్లేల రవీందర్, శ్యాం కుమార్, సతీష్ రెడ్డి, గణేష్, ధర్మానాయక్, రవీందర్ రెడ్డి లు అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు

# ఘనంగా 'విద్యా వారోత్సవాలు'

**– వైద్య అవగాహన సదస్సు, ప్రతిభావంతులకు సన్మానం**




**హనుమకొండ టౌన్, మే 13 (వుదయం ప్రతినిధి) :**

స్థానిక పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలు' మూడవ రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్ట్ నెంట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు సేవా, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

ఆరోగ్యంపై అవగాహన కళాశాల హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య అవగాహన సదస్సులో వడ్డేపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సాయి శ్రీ మాట్లాడుతూ.. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారుబి. శాంతిప్రియ డిగ్రీలో 9.96 CGPA సాధించినందుకు. జి. జ్యోతి (అసిస్టెంట్ ప్రొఫెసర్, కెమిస్ట్రీ): విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించినందుకు.ఎండి హసీనా బేగం ఉత్తమ నాన్‌టీచింగ్ సేవలకు గాను సన్మానం పొందారు. కళాశాల ప్రచార కార్యక్రమాలు వారోత్సవాల్లో భాగంగా అధ్యాపక బృందం హనుమకొండ పరిసర గ్రామాలైన ధర్మసాగర్, రఘునాథ్ పల్లి, వేల్డి, దామెర తదితర ప్రాంతాల్లో పర్యటించింది. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు, ప్రజా ప్రతినిధులకు కళాశాల ప్రత్యేకతలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. న్యాక్ 'A' గ్రేడ్ గుర్తింపు, అటానమస్ హోదా. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, వివిధ రకాల డిగ్రీ కోర్సులు.పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, జాబ్ మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. డి. సురేశ్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, వారోత్సవాల సమన్వయకర్త డా. డి. రామకృష్ణారెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలపై

# రాజ్యసభ సభ్యులు శ్రీ వేం నరేందర్ రెడ్డి కి వినతిపత్రం.



**ధర్మసాగర్ మే 13 ( వుదయం ప్రతినిధి )**

ఈరోజు ఉదయం తెలంగాణ రాష్ట్ర ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలపై రాజ్యసభ సభ్యులు శ్రీ వేం నరేందర్ రెడ్డి ని వారి స్వగ్రామమైన అర్వనపల్లి లో ఎన్ హెచ్ ఎం జేఏసీ ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమానికి ఎన్ హెచ్ ఎం? జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్. మహేందర్ రావు పుట్ట నాయకత్వం వహించారు. రాష్ట్ర ఎన్ హెచ్ ఎం కమిటీ తరఫున ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను, ఉద్యోగ భద్రత, వేతనాలు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలను వివరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ఎండి రుక్మద్దీన్, టి. సుమన్, యం. నరేష్ అలాగే మహబూబాబాద్ జిల్లా ఎన్ హెచ్ ఎం జేఏసీ సభ్యులు ఉమాకర్, హిమకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు శ్రీ వేం నరేందర్ రెడ్డి స్పందిస్తూ"ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలు ఇప్పటికే నా దృష్టికి వచ్చాయి. నిన్న మహబూబాబాద్ జిల్లా ఎన్ హెచ్ ఎం జేఏసీ ప్రతినిధులు కూడా కలిసి సమస్యలను వివరించారు. ఇప్పుడు రాష్ట్ర కమిటీ రావడం ద్వారా సమస్యల తీవ్రత అర్థమవుతోంది.ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం జేఏసీ నాయకత్వం మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లా కమిటీ తమ ప్రాంత ప్రజాప్రతినిధులు అయిన ఎం ఎల్ ఏ, ఎం ఎల్ సి, ఎంపీలను కలిసి ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను వినిపించాలని పిలుపునిచ్చింది.

“ఒక్కరి స్వరం వినిపించకపోవచ్చు. కానీ వేలాది ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల గళం ప్రభుత్వాన్ని కదిలిస్తుంది. మన సమస్యలను మనమే పోరాడితేనే పరిష్కారం సాధ్యమవుతుంది” అని డాక్టర్. మహేంద్రరావు పేర్కొన్నారు. ఎన్హెచ్ఎంఉద్యోగుల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని జేఏసీనేతలు పిలుపునిచ్చారు.

# గుండె పోటుతో వ్యక్తి మృతి



**టేకుమట్ల,మే13(వుదయం):**

టేకుమట్ల మండల కేంద్రంలో గుండెపోటుతో మేకల తిరుపతి(40) అనే వ్యక్తి అకాల మరణం చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తిరుపతి కి హఠాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చికిత్స నిమిత్తం ఆయనను వెంటనే చిట్యాల ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలోనే పరిస్థితి విషమించి ఆయన తుదిశ్వాస విడిచారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి.



**ఖానాపురం, మే 13 (వుదయం ప్రతినిధి):**

మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు చిన్నపెల్లి వెంకటేశ్వర్లుఅరుణ దంపతుల కుమార్తె వివాహానికి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై

నూతన వధూవరులు రక్షితరజినీకాంత్ లపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, జిల్లా నాయకుడు వల్లెపు శ్రీనివాస్, సొసైటీ పర్సన్ ఇన్చార్జ్ డైరెక్టర్లు దేవినేని వేణుకృష్ణ, ఆబోతు అశోక్ యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు బంధారపు శ్రీనివాస్, తేజావత్ బాలు నాయక్ నాయకులు వల్లెపు సోమయ్య, చిన్నపెల్లి సుధాకర్, రాధారపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు..



**రాయపర్తి మే 13 (వుదయం ప్రతినిధి):**

మండలం మైలారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్ల స్వామిఉమ వివాహము కృష్ణపురం ఎక్స్ రోడ్లో విఆర్ గార్డెన్లో జరుగుతున్న కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి,మాజీ ప్యాక్స్ చైర్మన్ కక్కిరాల హరి ప్రసాద్, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం మోరిపిరాల, గట్టికల్, మైలారం, గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ నాయకుల కుమార్తెల ప్రత్యూష రాజావిందు, ఇంద్రజ నవీన్, అను ప్రణయ్ ల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆశీర్వదించి, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మునవత్ నరసింహ నాయక్ మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల నాయకులు లేతకుల రంగారెడ్డి, గజ్జపల్లి ప్రసాద్, చందు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఆశీర్వాదం

**ఎంపీపీ వేములపల్లి.**



**ఖానాపురం, మే 13 (వుదయం ప్రతినిధి):**

మండల కేంద్రానికి చెందిన కసుపాధ సాంబయ్యమణెమ్మదంపతు కుమారుడి వివాహానికి మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు హాజరై నూతన వధూవరులు కసుపాద ఈశ్వరచారిసుప్రియ లపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. రంగాపురం గ్రామానికి చెందిన దాసరి రవిరాజమ్మ కుమారుడి వివాహానికి మాజీ ఎంపీపీ హాజరై నూతన వధూవరులు దాసరి రాజుసాదనలపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వల్లెపు శ్రీనివాస్, మండల సర్పంచ్ల ఫోరం ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బంధారపు శ్రీనివాస్ గౌడ్ మాజీ జెడ్పిటిసి మాచర్ల మాధవిగోవర్ధన్,

బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు గాదుదుల రమ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌన్సిలర్ దంపతులకు సన్మానం



**భూపాలపల్లి మే 13 (వుదయం విలేకరి)**

భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్ ఎరుకల రేణుక గణపతి దంపతులకు బుధవారం జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ సన్మానించారు ఇటీవల జరిగిన భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికలలో ఆరో వార్డు నుండి కౌన్సిలర్ గా గెలుపొందిన ఎరుకల రేణుక గణపతి లను సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆరవ వార్డు అభివృద్ధికి మరియు భూపాలపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేయవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో బత్తుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# చక్కని ఆరోగ్యం

## కాంతివంతమైన మెరిసే ముఖం కోసం..!



ఫేస్ మాస్క్‌లు సాధారణంగా ముఖం అంతటికీ కాంతిని అందిస్తాయి. కానీ, ఈ లూమిలిప్స్ మాస్క్ ప్రత్యేకంగా పెదవులు, వాటి చుట్టూ ఉండే చర్మంపై దృష్టి పెడుతుంది. ఇది కాంతి కిరణాల సహాయంతో పెదవులలోని కొవ్వు పొరను లక్ష్యంగా చేసుకుని, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల పెదవులు సహజంగానే మృదువుగా, నిండుగా కనిపిస్తాయి. ఈ పరికరం రెండు మోడ్లలో పనిచేస్తుంది. ఒకటి: వాల్యూమ్ యాంటీ ఏజింగ్ మోడ్. ఇది పెదవుల చుట్టూ ఉండే ముడతలు, స్మైల్ లైన్స్, వయసురీత్యా వచ్చే మార్పులను తగ్గిస్తుంది. మరొకటి: గ్లో అండ్ సూతింగ్ మోడ్. ఇది చర్మ ఛాయను మెరుగుపరచడమే కాకుండా, పెదవులకు సహజమైన మెరుపును ఇస్తుంది. ఈ మాస్క్‌ని రోజుకు 3 నుంచి 5 నిమిషాలు ఉపయోగిస్తే చాలు. కేవలం రెండు వారాల్లోనే స్పష్టమైన మార్పును గమనించవచ్చు. దీనిని ఉపయోగించినప్పుడు ఎలాంటి నొప్పి ఉండదు.

వైన్ తాగడం పురాతన కాలం నుంచి మామూలే! కానీ పురాతన కాలంలో వైన్‌ను ఒక సౌందర్య సాధనంగా కూడా ఉయోగించేవారు. రోమన్ మహిళలు ద్రాక్ష గింజలు, తొక్కలతో చేసిన మాస్క్‌లను ముడతలు పోగొట్టుకోవడానికి వాడేవారు. అలాగే ద్రాక్ష గుజ్జును బుగ్గలకు మంచి రంగు రావడం కోసం వాడేవారట! తరువాత 17వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లోని ఉన్నత వర్గాల మహిళలు చర్మం కాంతిమంతంగా మెరవడానికి రెడ్ వైన్‌తో ముఖం కడుక్కునే వారట! ముఖ్యంగా ఈ ప్రక్రియకే ఆధునికులు 'వైనోథెరపీ'గా పేరుపెట్టారు. వైనోథెరపీ ఎక్కువగా ప్రాచుర్యంలోకి వచ్చింది మాత్రం 1990లో. ఫ్రాన్స్‌కి చెందిన మథిల్డే థామస్, ఆమె భర్త బెర్ట్రాండ్ థామస్ ఈ ఆధునిక వైనోథెరపీకి మూలకారకులు. ఫ్రాన్స్‌లో మొదలైన ఈ వైనోథెరపీ ఇప్పుడు జపాన్, అర్జెంటీనా, అమెరికా, భారత్ వరకు విస్తరించింది. జుట్టు ఆరోగ్యంగా ఉండాలని ఒక్కోసారి మనం అతి జాగ్రత్తలతో చేసే పనులు సమస్యను తగ్గించడానికి బదులుగా మరింత పెంచుతాయి. జుట్టు జిడ్డుగా మారుతుందని తరచు షాంపూలతో తలస్నానాలు చేస్తుంటారు. దీనివల్ల తలలో సహజంగా ఉండే నూనెలు పోతాయి. చర్మం మరింత పొడిబారి, ఇంకా ఎక్కువ నూనెను ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల మైల్డ్ షాంపూలను మాత్రమే ఉపయోగించాలి. అలాగే వేసవిలో చాలామంది జుట్టును బిగుతుగా ముడి వేస్తుంటారు. దీనివల్ల తలలో చెమట, వేడి పెరిగి జుట్టు కుదుళ్లు బలహీన పడతాయి. అలాగే డ్రై షాంపూలు, స్ప్రేలు వాడినప్పుడు అవి చెమటతో కలిసి తల మీద ఒక పొరలా పేరుకుపోతాయి. ఇవి చర్మరంధ్రాలను మూసివేసి ఇన్ఫెక్షన్లకు దారి తీస్తాయి. అందువల్ల తలపై పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడానికి సున్నితమైన స్క్రబ్‌ను వాడాలి. ఎండలో వెళ్లేటప్పుడు హ్యాట్, లేదా స్కార్ఫ్ ధరించాలి. సూర్యరశ్మి వల్ల తల చర్మం దెబ్బతినకుండా ఉంటుంది. మన ముఖ చర్మం లాగే, తల చర్మం కూడా చాలా ముఖ్యం. అందువల్ల తలపై దురద పెడుతున్నా, జుట్టు పల్చబడుతున్నా, జిడ్డుగా ఉంటున్నా– అది మీ సహాయం కోరుతోందని అర్థం. అందువల్ల సమస్య చిన్నగా ఉన్నప్పుడే సరైన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జుట్టు రాలడాన్ని అరికట్టవచ్చు.

## మండే ఎండల్లో.. అవి రోజూ వద్దు!



మండే ఎండల్లో ఉక్కపోత, చెమటలు పట్టడం, చర్మం జిడ్డుగా మారడం.. వంటివి సహజం. అలాగని వీటిని నిర్లక్ష్యం చేస్తే వివిధ రకాల చర్మ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. ఇలా జరగకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు మేలు చేస్తాయని చెబుతున్నారు. వేసవిలో ఉండే విపరీతమైన వేడి కారణంగా చెమట భరించలేక తరచూ మొహం కడుక్కోవడం మామూలే. కానీ ఈ కాలంలో వీలైనంత తక్కువగా ఫేస్‌వాష్ చేసుకోవాలని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఎక్కువసార్లు ముఖం కడుక్కున్నప్పుడు చర్మం పైపొరల్లో ఉండే సహజసిద్ధమైన నూనెలు తొలగిపోతాయి.. అలాగే ఈ క్రమంలో మనం వాడే క్లెన్సర్లలోని రసాయనాల వల్ల చర్మం తేమను కోల్పోయి పొడిబారిపోతుంది. కాబట్టి ఈ కాలంలో క్లెన్సర్ల వినియోగం తగ్గించాలంటున్నారు నిపుణులు. అందు లోనూ సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన క్లెన్సర్లు, సబ్బులు వాడడం.. రోజులో రెండు మూడుసార్లు ముఖం శుభ్రం చేసుకోవాలనుకుంటే సాధారణ నీటితో క్లీన్ చేసుకోవడం.. మంచిదంటున్నారు నిపుణులు. బాగా ఉక్కపోతగా ఉన్నప్పుడు– మెడ, చంకలు, మోకాళ్లు, మోచేతులు.. వంటి శరీర భాగాల్లో చెమట ఎక్కువగా పడుతుంటుంది. అయితే ఆయా ప్రదేశా ల్లో ఎక్కువ సేపు చెమట అలా నిలిచి ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.. కాటన్ దుస్తులు ధరిస్తే అవి చెమటను సులభంగా పీల్చుకుంటాయి. అలాగే ఇంటికొచ్చాక వెంటనే యాంటీ ఫంగల్ సబ్బు ఉపయోగించి స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు. ఫలితంగా దుమ్ము, ధూళితో పాటు.. చెమట కారణంగా చర్మ సంబంధిత సమస్యలకు కారణమయ్యే బ్యాక్టీరియా సైతం సులభంగా తొలగిపోతుందని చెబుతున్నారు. వేసవిలో చెమట వల్ల చిరాగ్గా అనిపించి రోజూ తలస్నానం చేస్తుంటారు కొందరు. అయితే దీనివల్ల కుదుళ్లు పొడిబారి జుట్టు బలహీనపడే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. తద్వారా జుట్టు రాలిపోయే సమస్య కూడా ఎక్కువవుతుందని చెబుతున్నారు. కాబట్టి వారానికి రెండుసార్లు గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయడం శ్రేయస్కరం అని చెబుతున్నారు. కుదుళ్లకు చల్లదనాన్ని అందించే కలబంద–పెరుగు.. వంటిసహజసిద్ధమైన హెయిర్ మాస్కుల్ని అప్లై చేసుకోవడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు.

## ఎండల్లో హాయినిచ్చే రంగులు...

ఎండా కాలంలో వేడి నుంచి ఉపశమనం పొందడానికి మనం తీసుకునే ఆహారం, అలవాట్లే కాదు, మనం ధరించే దుస్తుల రంగులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి స్టైలిష్‌గా కనిపించేలా చేయడమే కాకుండా, శరీరానికీ చల్లదనం అందిస్తాయి. మరి ఎలాంటి రంగుల్ని ఎంచుకోవాలో తెలుసా?

తెలుపు: వేసవి ఫ్యాషన్‌లో తెలుపు రంగుది ప్రత్యేక స్థానం. ఇది సూర్యరశ్మిని గ్రహించకుండా వెనక్కి తిప్పి పంపిస్తుంది. దీనివల్ల వేడి తక్కువగా అనిపిస్తుంది. తెల్లటి కాటన్ కుర్తాలు, ఖాదీ చీరలు, లినెన్ షర్టులు వంటివి ధరించడం వల్ల క్లాసీ లుక్ వస్తుంది.



పసుపు: ఎండాకాలం అంటేనే పసుపు పచ్చని మెరుపు. అయితే ముదురు పసుపు కాకుండా లెమన్ ఎల్లో, సాఫ్ట్ ఎల్లో ఛాయలను ఎంచుకుంటే చూడచక్కగా అనిపిస్తుంది. వైట్ ప్యాంట్స్ లేదా పలాజోలపై ఎల్లో ట్యూనిక్స్ ధరిస్తే ఆ స్టైలే వేరు.

పేస్టల్ కలర్స్: ప్రస్తుతం ఫ్యాషన్ ప్రపంచంలో పేస్టల్ రంగులదే హవా. ముదురు రంగుల కంటే లేలేత ఛాయలు కంటికి ఆహ్లాదాన్నిస్తాయి.

మింట్ గ్రీన్: ప్రకృతికి దగ్గరగా ఉండే మింట్ గ్రీన్ వేసవిలో ఫ్రెష్ లుక్‌నిస్తుంది. లావెండర్ రాయల్ లుక్ ఇవ్వడమే కాకుండా, ఎండలో తిరిగేటప్పుడు కూడా హుందాగా ఉంటుంది.

పీచ్–కోరల్: కాషాయ వర్ణంలో లేత ఛాయలైన పీచ్ – కోరల్ రంగులు వేసవి సాయంత్రాలకు సరైన ఎంపిక. ఇవి చర్మఛాయను ప్రకాశవంతంగా చూపిస్తాయి. కాటన్ శారీలు లేదా ఫ్రాక్ స్టైల్ డ్రెస్సుల్లో ఈ కలర్స్ అద్భుతంగా ఉంటాయి. రంగు ఎంత బాగున్నా, వస్త్రం సరిగ్గా లేకపోతే ఇబ్బంది తప్పదు. వేసవిలో కాటన్, లినెన్, మల్‌మల్ వస్త్రాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వండి. ఇవి చెమటను త్వరగా పీల్చుకుని చర్మాన్ని పొడిగా ఉంచుతాయి.

## కరివేపాకుతో పానీయం

పండ్లతోనే కాదు కాయగూరలతోనూ కాన్‌సన్ట్రేట్ డ్రింక్ తయారుచేయొచ్చు. కరివేపాకుతో చిక్కటి పానీయం చేసి నిలవుంచుకుంటే.. ఎప్పుడంటే అప్పుడు తాగొచ్చు.

కావలసినవి: కరివేపాకు – రెండు కప్పులు, నిమ్మరసం – 2 స్పూన్లు, జీలకర్ర – టేబుల్ స్పూన్, మిరియాలు – స్పూన్, అల్లం తరుగు – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి తగినంత, బెల్లంపొడి – కప్పు, నెయ్యి – స్పూన్, ఇంగువ – చిటికెడు

తయారీ: కరివేపాకును కడిగి, వస్త్రం మీద ఆరబెట్టాలి. కడాయిలో జీలకర్ర, మిరియాలను వేయించాలి. చల్లారాక.. కరివేపాకు, అల్లం, కప్పు నీళ్లు జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీన్ని మందమైన గిన్నెలోకి తీసి.. సన్న సెగ మీద వేడిచేయాలి. ఆరేడు నిమిషాల తర్వాత బెల్లంపొడి, ఉప్పు, ఇంగువ, నెయ్యి వేసి కలియబెడుతూ ఉడికించాలి. మిశ్రమం చిక్కగా అయ్యాక స్టవ్ ఆఫ్ చేయాలి. పూర్తిగా చల్లారిన తర్వాత నిమ్మరసం కలపాలి. అంతే.. ఆరోగ్యకరమైన పానీయం సిద్ధమవుతుంది. పూర్తిగా చల్లారాక.. శుభ్రమైన సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకుంటే రెండు నెలలు నిల్వ ఉంటుంది. తాగదలచినప్పుడు గ్లాసు చల్లని నీళ్లలో రెండు స్పూన్ల కాన్‌సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. ఫ్రిజ్‌లో కాకుండా బయట ఉంచేట్లయితే.. మిశ్రమాన్ని ఇంకొంచెం చిక్కబడేట్లు ఉడికించాలి. ఇది మూడు నుంచి నాలుగు వారాలు నిల్వ ఉంటుంది. ఈ పానీయం జీర్ణశక్తిని పెంచుతుంది, రక్తహీనతను తగ్గిస్తుంది. కురులను సంరక్షిస్తుంది. నిమ్మరసం చల్లారిన తర్వాతే కలపాలి. సీసాలో ఎంతమాత్రం తడి ఉండకూడదు. తడి స్పూన్ ఉపయోగించకూడదు.



## కుంకుడు కాయలు.. ఇలా కూడా..!

ఒకప్పుడు తలస్నానం చేయడానికి కుంకుడు కాయలనే ఉపయోగించేవారు. అయితే మార్కెట్లోకి షాంపూలు అందుబాటులోకి వచ్చాక వాటి వాడకం బాగా తగ్గిపోయింది. అయితే కేవలం జుట్టును శుభ్రపరచుకోవడానికే కాకుండా ఇంట్లో ఇతరత్రా పనులకు కూడా కుంకుడు కాయల్ని ఉపయోగించుకోవచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి.. కప్పు నీటిలో రెండు కుంకుడు కాయలు వేసి అరగంట పాటు మరగబెట్టాలి. ఆ తర్వాత పూర్తిగా చల్లారనిచ్చి వడకట్టుకోవాలి. దీనికి మీకు నచ్చిన ఫ్లేవర్ అరోమా ఆయిల్‌ని కొన్ని చుక్కలు వేసి కలుపుకోవాలి. అనంతరం శుభ్రంగా కడిగి పొడిగా ఆరబెట్టుకున్న బాటిల్‌లో ఈ మిశ్రమాన్ని పోసి ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవాలి. దీన్ని స్నానం చేసేటప్పుడు సబ్బుకి బదులుగా ఉపయోగించవచ్చంటున్నారు నిపుణులు. కిటికీల అద్దాలను తుడవడానికి సాధారణంగా మార్కెట్లో దొరికే క్లీనింగ్ లిక్విడ్‌లను ఉపయోగిస్తాం. అయితే వీటికి బదులుగా కుంకుడు కాయలను ఉపయోగించి కూడా ఇంట్లోనే గ్లాస్‌క్లీనర్‌ను తయారు చేసుకోవచ్చు. దీనికోసం కుంకుడు కాయలతో తయారు చేసుకున్న లిక్విడ్ సోప్ ఒక టేబుల్ స్పూన్, రెండు టేబుల్ స్పూన్ల వైట్ వినెగర్, అరకప్పు నీటిని తీసుకొని బాగా కలుపుకోవాలి. దీన్ని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి బాగా షేక్ చేయాలి. అనంతరం దీన్ని కిటికీ అద్దంపై స్ప్రే చేసి మెత్తటి వస్త్రంతో తుడిచేయాలి. ఇలా చేస్తే కిటికీ అద్దాలపై పేరుకున్న దుమ్ము తొలగిపోయి అవి కొత్త వాటిలా మెరుస్తాయట. పట్టు, జరీ దుస్తుల్ని ఉతకడానికి కుంకుడు కాయలు చక్కటి ప్రత్యామ్నాయం. దీనికోసం కొన్ని కుంకుడు కాయలను చల్లటి నీటిలో నానబెట్టి వాటి రసాన్ని తీయాలి. ఈ మిశ్రమంతో పట్టు, జరీ వస్త్రాలను ఉతికితే అవి ఎక్కువ కాలం మన్నడంతో పాటు రంగు వెలిసిపోకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. అంటే పట్టు, ఇతర సున్నితమైన వస్త్రాల్ని మనం ఎలాగైతే షాంపూ వాష్ చేస్తామో.. ఆ షాంపూ బదులుగా ఈ సహజసిద్ధమైన షాంపూను ఉపయోగించచ్చన్నమాట! అరకప్పు కుంకుడుకాయ రసానికి రెండు చెంచాల వైట్ వినెగర్, కొద్దిగా నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో పోసి బాగా షేక్ చేసుకోవాలి. దీంతో కిచెన్ ప్లాట్‌ఫాం, వాష్‌బేసిన్ లాంటివి శుభ్రం చేసుకోవచ్చు. అలాగే దీన్ని బాత్‌రూం క్లీనర్‌గా కూడా ఉపయోగించవచ్చంటున్నారు నిపుణులు.



## అలవాట్లు వదులుకోనక్కర్లేదు!



ఆరోగ్యంగా ఉండాలనీ... ఫిటెనెస్‌కి ప్రాధాన్యం ఇవ్వాలనీ... ఎంతో ఆసక్తిగా వ్యాయామాలు, నడక, పరుగు వంటివి మొదలుపెడతాం. ఇష్టంగా వాటికి కావాల్సిన ట్రాక్స్, టాంక్ టాప్స్, షూస్ అన్నీ కొనుక్కుంటాం. కానీ రెండు మూడు రోజులకే అన్నీ అటకెక్కిపోతాయి. సమయం లేదు, నిద్రలేమి, నిస్సత్తువ అంటూ రకరకాల కారణాలు చెబుతాం. మీదే కాదు, చాలామంది పరిస్థితి ఇదే. అందుకే 'హ్యాబిట్ స్టాకింగ్' అలవరుచుకోమంటున్నారు నిపుణులు. అంటే సమయం ఉన్నప్పుడూ, ఆరోగ్యం సహకరించినప్పుడూ ఎలానో వాకింగ్, జాగింగ్ వంటి వాటికి వెళుతుంటాం కదా! అలా లేనప్పుడు రోజూ చేసే పనులతో వ్యాయామాలు జత చేయడమే హ్యాబిట్ స్టాకింగ్. బ్రష్ చేస్తూ స్ట్రెంత్‌నింగ్ వ్యాయామాలు చేయడం. అటూ ఇటూ నడవడం. కాఫీ తాగడం అయిపోయాక పది నిమిషాలు కళ్లు మూసుకుని ధ్యానం చేయడం. నిద్రకు ముందు కనీసం పుస్తకంలో ఒక్క పేజీ అయినా చదవాలనే నియమం పెట్టుకోవడం... వంటివి దీని జాబితాలోకి వస్తాయి. దీనివల్ల అలవాట్లని దాటవేస్తున్నాం అన్న భావన ఉండదు. రోజువారీ పనులు పూర్తి చేస్తూనే... అలవాట్లు వదులుకోకుండా కొనసాగించిన వాళ్లు అవుతారు. నచ్చితే ప్రయత్నించేయండి మరి!

## నోరూరించే పుచ్చకాయ పానీయం

ఎండాకాలం వచ్చేసింది. తేనీరు కంటే చల్లటి పానీయాలు తాగాలనిపిస్తుంది. మార్కెట్లో దొరికే కూల్‌డ్రింక్స్ కొనే బదులు మనమే కాన్‌సన్ట్రేట్ చేసుకోవచ్చు. మీ కోసం పుచ్చకాయలతో పానీయం.. ఈ పానీయం కోసం.. చెక్కు, గింజలు తీసిన పుచ్చకాయ ముక్కలు – నాలుగు కప్పులు, నీళ్లు – కప్పు, పంచదార – రెండు కప్పులు, ఉప్పు – చిటికెడు, నిమ్మరసం – నాలుగు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి – అర స్పూన్ తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. పుచ్చకాయ ముక్కలను గ్రైండ్ చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో పంచదార, కప్పు నీళ్లు పోసి వేడిచేయాలి. పంచదార కరిగిన తర్వాత పుచ్చకాయ రసం, యాలకుల పొడి జతచేసి ఉడికించాలి. అడుగంటకుండా మధ్యమధ్యలో కలియబెడుతుండాలి. చివర్లో నిమ్మరసం, ఉప్పు కూడా వేసి.. కొన్ని క్షణాలుంచి దించేయాలి. మరీ ఎక్కువసేపు ఉంచితే రంగు మారుతుందని గుర్తుంచుకోవాలి. చల్లారిన తర్వాత తడి లేని సీసాలోకి తీసి భద్రం చేసుకోవాలి. తాగదలచినప్పుడు గ్లాసు నీళ్లలో రెండు స్పూన్ల కాన్‌సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే.. నెల రోజులు నిలవుంటుంది. మరి కొంత కాలం నిల్వ ఉండాలంటే ఇంకో స్పూన్ నిమ్మరసం అదనంగా జోడించాల్సి ఉంటుంది.



## విపణిలోకి బ్రిక్స్‌టన్ మోటార్ సైకిల్స్

ఐరోపా ద్విచక్ర వాహన బ్రాండ్లు బ్రిక్స్‌టన్ మోటార్ సైకిల్స్, వీఎల్ఎఫ్ స్కూటర్లు హైదరాబాద్ విపణిలో అందుబాటులోకి వచ్చినట్లు విక్రయ సంస్థ మోటోహౌస్ ఇండియా మంగళవారం ఇక్కడ ప్రకటించింది. దేశ వ్యాప్తంగా 14 విక్రయ కేంద్రాలుండగా, ఈ ఏడాదిలో కొత్తగా 16 ప్రారంభించబోతున్నామని, ప్రీమియం మోటార్ సైకిళ్లకు గిరాకీ పెరగడమే ఇందుకు కారణమని మోటోహౌస్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తుషార్ షెల్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో తొలి దశ కింద రూ.70 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో, ఏడాదికి 25,000 వాహనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉందని వివరించారు.

# బిజినెస్

## పెట్రోల్, డీజిల్ ధరలపై
# ఆర్‌బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (IMF) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను కోరారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి కేంద్రం పెంచింది. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గత కొంతకాలంగా చమురు ధరలూ పెంచుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లు పైపైకి




బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ సుంకాల పెంపుతో దేశీయంగా ఈ లోహాల ధరలు భగ్గుమన్నాయి. బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలు అమాంతం పెరగ్గా.. గోల్డ్ ఈటీఎఫ్‌లకూ రెక్కలొచ్చాయి. పుత్తడి ధర ఒక్క రోజులోనే దాదాపు రూ.9వేలు పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1.65లక్షలు దాటింది. క్రితం రోజుతో పోలిస్తే (రూ.1.56లక్షలు) దాదాపు రూ.9వేలు వరకు పెరగడం గమనార్హం. ఇక, కేజీ వెండి ధర రూ.2.95లక్షలు దాటింది. అటు మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ గోల్డ్ ఫ్యూచర్స్‌లో 10 గ్రాముల ధర జూన్ డెలివరీ 6శాతం పెరిగి రూ.1,62,648కి చేరింది. సిల్వర్ ఫ్యూచర్స్‌లో కేజీ ధర జులై డెలివరీ 6 శాతం పెరిగి రూ.2.95 లక్షలు పలుకుతోంది. అంతర్జాతీయంగా ఔన్సు బంగారం ధర 4707 డాలర్లు పలుకుతుండగా.. వెండి 86 డాలర్లు దాటేసింది. గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్ ధరలూ భారీగా పెరిగాయి. అత్యధికంగా క్వాంటమ్ గోల్డ్ ఫండ్ ధర దాదాపు 15శాతం పెరిగి ఇంట్రాడేలో రూ.143.37ను తాకింది. టాటా గోల్డ్ ఈటీఎఫ్ 12 శాతం, జిరోదా గోల్డ్ ఈటీఎఫ్ 9 శాతం మేర పెరిగాయి. అటు సిల్వర్ ఈటీఎఫ్‌లు కూడా 10శాతం వరకు ఎగబాకాయి. దేశీయ బంగారం ధరలకు దగ్గరగా ఉంటూ.. చిన్న మొత్తం లోనూ పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పించేవే గోల్డ్ ఈటీఎఫ్‌లు. వీటిలో మదుపు చేయడం అంటే.. బంగారాన్ని ఎలక్ట్రానిక్ విధానంలో కొనడం అన్నమాట. డీమ్యాట్ ఖాతా ఉన్నవారు వీటిని యూనిట్ల రూపంలో కొనుగోలు చేయొచ్చు. కావాలనుకున్నప్పుడు వెంటనే అమ్మొచ్చు. పసిడిలో సులభంగా లావాదేవీలు నిర్వహించేందుకు ఇవి ఒక సులభమైన మార్గంగానూ అనుకోవచ్చు. మరోవైపు, వరుసగా మూడో రోజు జ్యువెలరీ స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి. బంగారం కొనుగోళ్లు ఏడాది పాటు నిలిపివేయాలంటూ ప్రధాని మోదీ పిలుపునివ్వడం, పసిడిపై దిగుమతి సుంకాలు పెంచడం వంటి కారణాలతో ఈ లోహానికి గిరాకీ తగ్గొచ్చని మదుపర్లు అంచనా వేస్తున్నారు. దీంతో జ్యువెలరీ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. నేటి ట్రేడింగ్‌లో స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ షేరు ధర ఏకంగా 11శాతం పతనమైంది. కల్యాణ్ జ్యువెలర్స్ షేరు 6శాతం, సెంకో గోల్డ్ 4.30శాతం మేర కుంగాయి.

# యాపిల్‌కు పోటీగా గూగుల్‌బుక్

టెక్ దిగ్గజం గూగుల్ 'గూగుల్ బుక్'ను ఆవిష్కరించింది. జెమినై ఏఐ ఆధారంగా రూపొందించిన సరికొత్త ఏఐ కేటగిరీ ల్యాప్‌టాప్‌ను తీసుకువచ్చింది. ఆండ్రాయిడ్ క్రోమ్‌ఓఎస్ ఆధారంగా ఇది పని చేయనుంది. తాజాగా ఆండ్రాయిడ్ షోలో గూగుల్ దీనిని పరిచయం చేసింది. గూగుల్‌బుక్ యూజర్లకు ఆటోమేటిక్‌గా ఆండ్రాయిడ్ యాప్స్ అందుబాటులో ఉంటాయి. వాటితోపాటు జెమినై ఏఐ ఫీచర్లను పొందొచ్చు. వీటికి క్రోమ్ ఓఎస్ ఎక్స్‌పీరియన్స్ అదనం. వాస్తవంగా ఏ ఆపరేటింగ్ సిస్టమ్‌ను వాడారో గూగుల్ (Google) అధికారికంగా వెల్లడించలేదు. అయితే ఏఐ ఇంటెలిజెన్స్ కోసం అధునా తన ఓఎస్‌ను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ఇది యాపిల్ మ్యాక్ బుక్ నియోకు పోటీ ఇవ్వనుందని తెలుస్తోంది. 2011 మే 11న గూగుల్ తొలిసారి క్రోమ్‌బుక్స్‌ను ఆవిష్కరించింది. సరిగ్గా 15 ఏళ్ల తర్వాత ఈ గూగుల్‌బుక్‌ను తీసుకువచ్చింది. ఈ గూగుల్‌బుక్‌లో మ్యాజిక్ పాయింటర్, క్రియేట్ యువర్ విడ్జెట్ వంటి ఫీచర్లు ఉన్నాయి. మ్యాజిక్ పాయింటర్ ఏఐ ఆధారిత కర్సర్. దానిని గూగుల్ డీప్‌మైండ్ అభివృద్ధి చేసింది. వినియోగదారులు స్క్రీన్‌పై తమ కర్సర్‌ను ఎక్కడుంచారో దానినిబట్టి వెంటనే తగిన సూచనలు పొందే వీలుంది. ఇక, చిన్న ప్రాంప్ట్ ఇవ్వడం ద్వారా సొంతంగా విడ్జెట్‌ను రూపొందించుకోవచ్చు. గూగుల్ బుక్‌మార్క్స్ ఫైల్ బ్రౌజర్ ద్వారా ఫోన్‌లోని ఫైళ్లను యాక్సెస్ చేసుకోవచ్చు. ల్యాప్‌టాప్స్, ఫోన్ల మధ్య కనెక్టివిటీని గూగుల్‌బుక్స్ మరింత పెంచనున్నాయి.



## భగ్గుమన్న నిత్యావసరాలు..

పసిడి, వెండి ఆభరణాలతో పాటు కొన్ని వంటగది సరుకుల ధరలు పెరగడంతో ఏప్రిల్‌లో రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి పెరిగింది. ఈ ఏడాది జనవరిలో 2.74%, ఫిబ్రవరిలో 3.21%, మార్చిలో 3.40 శాతంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం నమోదైంది. 2024 బేస్ ఏడాది ప్రకారం వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలను జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) మంగళవారం విడుదల చేసింది. ఆహార ద్రవ్యోల్బణం మార్చిలో 3.87% కాగా, గత నెలలో 4.20 శాతానికి చేరింది. ఏప్రిల్‌లో పసిడి ఆభరణాలు 144.34% ప్రియమయ్యాయి. తర్వాతి స్థానాల్లో కొబ్బరి (44.55%), పసిడి, వజ్రాలు, ప్లాటినం ఆభరణాలు (40.72%), టమాటా (35.28%), కాలీఫ్లవర్ (25.58%) ఉన్నాయి. బంగాళదుంపలు, ఉల్లిపాయలు, మోటార్‌కార్లు, జీపులు, బఠానీలు, ఏసీల ధరలు తగ్గాయి. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 3.74 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 3.16 శాతంగా నమోదైంది.

# స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీలు.. ఆరంభ నష్టాల నుంచి గట్టెక్కాయి. మెటల్, ఆయిల్, గ్యాస్ స్టాక్స్ దన్నుగా నిలిచాయి. నిఫ్టీ 23,400 ఎగువన ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరింత క్షీణించింది. ఓ దశలో రూ.95.80 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. సెన్సెక్స్ ఉదయం 74,439.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,559.24) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొంది. ఇంట్రాడేలో 74,134.48–75,191.57 మధ్య దాదాపు వెయ్యి పాయింట్ల మేర కదలాడిన సూచీ.. చివరకు 49.74 పాయింట్ల లాభంతో 74,608.98 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 33.05 పాయింట్ల లాభంతో 23,412.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.71గా ఉంది.
సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభపడ్డాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, సన్‌ఫార్మా, టెక్‌మహీంద్రా షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4701 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# క్రీడలు

## ఆ గందరగోళాన్ని సరిదిద్దుతున్నాం



దిల్లీ: భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ట్రయల్స్ వివాదంపై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ స్పందించాడు. వినేశ్ అనర్హత, రెజ్లింగ్ ట్రయల్స్‌లో ఆమె పాల్గొనడం వంటి అంశాలు పూర్తిగా ప్రస్తుత డబ్ల్యూఎఫ్ఐ పరిధిలోనివని చెప్పాడు. "ఆ దేవి (వినేశ్) గారు సృష్టించిన గందరగోళాన్ని మేం సరిదిద్దుతున్నాం. ప్రస్తుతం ఈ వ్యవహారం న్యాయస్థానం పరిధిలో ఉంది. పోటీలు ఎక్కడ జరగాలి.. ఎవరు ఆడాలి అన్నది డబ్ల్యూఎఫ్ఐ నిర్ణయిస్తుంది. అది నా పరిధిలోని అంశం కాదు. నేను చాలాకాలం పాటు అధ్యక్షుడిగా ఉన్నా. రెజ్లింగ్ సమాఖ్య ఏర్పడిందే క్రీడాకారుల కోసం. ఎవరినైనా అడ్డుకున్నారంటే దానికి కచ్చితమైన కారణం ఉంటుంది. అదేంటో చదువుకోవాలి'' అని బ్రిజ్‌భూషణ్ తెలిపాడు.

# అక్కడ ఏ జట్టుకూ సేఫ్ కాదు: కైఫ్

ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. తాజాగా సన్‌రైజర్స్‌ను చిత్తు చేసిన గుజరాత్ అనూహ్యంగా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఆ జట్టు వరుసగా ఐదు మ్యాచుల్లో గెలవడం గమనార్హం. ఇక ఆర్సీబీ, సన్‌రైజర్స్, హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ తర్వాత స్థానాల్లో నిలిచాయి. సీఎస్‌కే, రాజస్థాన్ కూడా తమ అవకాశాలు కోసం పోటీ పడుతున్నాయి. టాప్–4లో నిలవాలనుకొనే జట్లను మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ హెచ్చరించాడు. అలాగే తొలిసారి అహ్మదాబాద్‌లో ఆడి ఘోర ఓటమిని చవిచూసిన సన్‌రైజర్స్ ఎలాంటి కంగారు పడక్కర్లేదని వ్యాఖ్యానించాడు. 'సీఎస్‌కేతో చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ తలపడనుంది. సొంత మైదానం కావడంతో చెన్నై సూపర్ కింగ్స్‌కు అడ్వాంటేజ్ ఉంటుంది. తప్పకుండా ఎస్ఆర్‌హెచ్‌కు కఠిన సవాల్ ఎదురవుతుంది. అయితే, పరిస్థితులను త్వరగా అలవర్చుకుని ఆడితే పెద్ద కష్టమేం కాదు. గుజరాత్‌తో మ్యాచ్‌లో అదే పొరపాటును సన్‌రైజర్స్ చేసింది. తప్పకుండా దీనిపై వారి డ్రెస్సింగ్ రూమ్‌లో చర్చించుకోవాలి. అలాగని ఈ ఓటమితో కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇక చివరి మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్‌తో హైదరాబాద్‌లో తలపడనుంది. ఈ రెండు మ్యాచులు సన్‌రైజర్స్‌కు అత్యంత క్లిష్టమైనవే. అయితే, టాప్–4 కోసం పోటీపడుతున్న జట్లేవీ సురక్షితంగా ఉన్నాయని అనుకోవద్దు'' అని కైఫ్ వెల్లడించాడు. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై గుజరాత్ టైటాన్స్ భారీ విజయం సాధించింది. 169 పరుగుల లక్ష్య ఛేదనలో 86 రన్స్‌కే కుప్పకూలింది. ఈ క్రమంలో అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "హైవేపైనా.. ట్రాఫిక్‌లోనూ ఒకే స్పీడ్‌తో వెళ్లగలమా? కానీ, అభిషేక్ శర్మ ఆ తప్పే చేశాడు. హైవేలపైనా 100 కి.మీ కంటే ఎక్కువ స్పీడ్‌తో వెళ్లే అవకాశం ఉంటుంది. కానీ, ట్రాఫిక్‌లోనూ వెళ్తే ఎవరో ఒకరు గాయపడతారు. క్రికెట్ కూడా అంతే. పరిస్థితికి తగ్గట్టుగా స్పందించాలి. అభిషేక్ ఔటైన బంతికి సింగిల్ తీసి.. నాన్‌స్ట్రైకింగ్‌కు వెళ్లుంటే బాగుండేది. మంచి భాగస్వామ్యాన్ని నిర్మిస్తే సన్‌రైజర్స్ విజయం సాధించే అవకాశాలు ఎక్కువ. విరాట్, రోహిత్ శర్మ ఎందుకు లెజెండ్స్ అయ్యారో కుర్రాళ్లు తెలుసుకోవాలి. వారు పరిస్థితులను అర్థం చేసుకుని ఆడతారు. ఏ రోడ్డుపైన అయినా ఒకే వేగంతో వెళ్లు. సన్‌రైజర్స్‌లో టాప్ –3 బ్యాటర్లలో ఒక్కరు కూడా బాధ్యత తీసుకోలేదు'' అని అశ్విన్ విశ్లేషించాడు.



# ద్రవిడ్‌కూ ఓ టీ20 ఫ్రాంఛైజీ



బ్యాటర్, కెప్టెన్, వికెట్‌కీపర్, కోచ్, మెంటార్.. ఇలా తన కెరీర్‌లో భిన్నమైన పాత్రలు పోషించిన భారత దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ ఇప్పుడు ఓ కొత్త అడుగు వేశాడు. ఓ ఫ్రాంఛైజీకి యజమాని అయ్యాడు. ఐరోపా టీ20 లీగ్‌లో డబ్లిన్ గార్డియన్స్ జట్టును తాజాగా ద్రవిడ్ కొన్నాడు. ఈ ఏడాది ఆగస్టులో ఆరు ఫ్రాంఛైజీలు తలపడే ఐరోపా లీగ్ ఆరంభం కానుంది. ఐరోపాలో ఐసీసీ ఆమోదం పొందిన తొలి బహుళ దేశాల క్రికెట్ టోర్నీ ఇదే. ఐర్లాండ్, స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ సంఘాలు ఈ లీగ్‌లో భాగమయ్యాయి. "ఐరోపాలో దిగువ స్థాయి నుంచి క్రికెట్లో ప్రతిభావంతులను వెలికి తీయడానికి ఈ లీగ్ ఉపయోగపడుతుంది. ఇక్కడ ఆట ఎదుగుదలకు ఇదెంతో సహకరిస్తుంది. నన్ను ఆకట్టుకున్న అంశం అదే. అందుకే డబ్లిన్ గార్డియన్స్ జట్టును కొని ఈ లీగ్‌లో భాగమయ్యా. స్టార్ ప్లేయర్లతో స్థానిక కుర్రాళ్లు కలిసి ఆడబోతుండడంతో ఈ లీగ్ ఆసక్తికరంగా సాగబోతోంది'' అని ద్రవిడ్ చెప్పాడు. మరోవైపు బ్యాటర్లకు పెద్దపీట వేస్తున్న టీ20ల్లో రాణించాలంటే బౌలర్లు తమ ఆటను మరింత మెరుగుపరుచుకోవాలని ద్రవిడ్ అన్నాడు. "గత మూడేళ్ల నుంచి చూస్తే టీ20ల్లో బ్యాటింగ్ నాణ్యత మరింత పెరిగింది. బ్యాటర్లు ఎలాగైనా ఫోర్లు, సిక్సులు కొట్టేస్తున్నారు. భిన్నమైన షాట్లు ప్రయత్నిస్తున్నారు. వారిని సవాల్ చేయాలంటే బౌలర్లు కూడా తమ ఆటను మెరుగుపరుచుకోవాలి. తమ నైపుణ్యాలను పెంచుకోవాలి'' అని ద్రవిడ్ తెలిపాడు.
ఐరోపా టీ20 లీగ్‌లో ఫ్రాంఛైజీల కొనుగోళ్లలో పలువురు మాజీ క్రికెటర్లతో పాటు బాలీవుడ్ స్టార్లు కూడా భాగమయ్యారు. అభిషేక్ బచ్చన్ ఐరోపా లీగ్ వ్యవస్థాపకుల్లో ఒకడు. ఐరిష్ వోల్ఫ్స్ జట్టుకు మ్యాక్స్‌వెల్.. ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్‌కు స్టీవ్ వా.. ఎడిన్‌బరో క్యాజిల్ రాకర్స్‌కు మెక్‌కలమ్, కైల్ మిల్స్.. గ్లాస్గో కాస్మిక్‌కు జాంటీ రోడ్స్, డుప్లెసిస్, క్లాసెన్ సహ యజమానులుగా ఉన్నారు. స్టీవ్ స్మిత్, మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్, మిచెల్ శాంట్నర్, లివింగ్‌స్టన్ లాంటి ప్రస్తుత క్రికెటర్లతో పాటు మాజీ ఆటగాళ్లు మెక్‌కలమ్, రోడ్స్, డుప్లెసిస్, క్లాసెన్ ఈ లీగ్‌లో ఆడబోతున్నారు.

# పంజాబ్ కింగ్స్‌పై రూమర్లు.. ప్రీతి జింటా వార్నింగ్

ఈ ఐపీఎల్ సీజన్‌లో తొలుత అదిరే ఆటతో వరుస విజయాలతో దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్.. సెకండాఫ్‌లో చతికిలపడింది. వరుసగా నాలుగో ఓటమితో ప్లేఆఫ్ ఆశలను సంక్లిష్టం చేసుకుంది. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా పంజాబ్ జట్టుపై నెట్టింట విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జట్టు ఆటగాళ్లలో క్రమశిక్షణ, సమన్వయం లోపించాయని, దీనివల్లే వరుస ఓటములు చవిచూడాల్సి వస్తోందని ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వార్తలపై పంజాబ్ కింగ్స్ సహ యజమాని ప్రీతి జింటా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి అసత్య ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. "విమర్శలు, అసత్య ప్రచారం మధ్య చాలా తేడా ఉంటుంది. గేమ్ గురించి ఆరోగ్యకరమైన చర్చను మేం స్వాగతిస్తాం. కానీ, ఉద్దేశపూర్వకంగా అసత్య కథనాలను వ్యాప్తి చేస్తూ.. మా ఆటగాళ్లు, జట్టు పరువుకు భంగం కలిగిస్తే మాత్రం సహించేది లేదు. నిరాధార సమాచారం విషయంలో మీడియా అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నా'' అని ప్రీతి జింటా తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అటు పంజాబ్ కింగ్స్ జట్టు కూడా దీనిపై సోషల్ మీడియాలో స్పందించింది. "క్రీడల్లో విమర్శలు, సరదా సంభాషణలు, అభిప్రాయాలు సాధారణమే. కానీ, చౌకబారు ఆదరణ కోసం అసత్య కథనాలను సృష్టించడం ఆటలో భాగం కాదు. పాపులారిటీ కోసం తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే ముందు వాస్తవాలను నిర్ధరించుకోవాలని కోరుతున్నాం'' అని ఫ్రాంఛైజీ రాసుకొచ్చింది.



# వినేశ్ పునరాగమనానికి సాక్షి మద్దతు




తల్లిగా రెజ్లింగ్ రింగ్‌లో పునరాగమనం చేయాలని అనుకుంటున్న వినేశ్ ఫొగాట్‌కు ఒలింపిక్ కాంస్య పతక విజేత సాక్షి మలిక్ మద్దతు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా క్రీడాకారిణులు తల్లులైన తర్వాత తిరిగి క్రీడల్లోకి వచ్చేందుకు నిబంధనలు సడలిస్తుంటే.. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాత్రం వినేశ్‌ను అడ్డుకుంటోందని సాక్షి ఆరోపించింది. ఇటీవల గొండాలో జరిగిన జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో డబ్ల్యూఎఫ్ఐ తనను అనర్హురాలిగా ప్రకటించినా.. 10 నెలల కొడుక్కి తల్లి అయిన వినేశ్ పోటీల కోసం అక్కడికి రావడం చర్చనీయాంశమైంది. డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం రిటైర్మెంట్ నుంచి తిరిగి రావాలనుకునే క్రీడాకారులు ఆరు నెలలు ముందస్తు నోటీసు ఇవ్వడం తప్పనిసరి అని.. ఆ గడువు పూర్తవకుండా పోటీపడటానికి వీల్లేదంటూ వినేశ్‌కు పంపిన షోకాజ్ నోటీసులో డబ్ల్యూఎఫ్ఐ పేర్కొంది. "ప్రస్తుతం వినేశ్ ఒక రాజకీయ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా కొనసాగుతోంది. నాకు రాజకీయాలతో సంబంధం లేదు. కానీ మహిళలు తల్లులైన తర్వాత కూడా పతకాలు సాధించేలా చాలా దేశాలు నిబంధనలు సడలిస్తున్న ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. వినేశ్ పునరాగమనాన్ని అడ్డుకోడానికే డబ్ల్యూఎఫ్ఐ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ జోక్యం చేసుకోవాలి. వినేశ్‌కు ట్రయల్స్ నిర్వహించి.. ఆమె దేశానికి పతకాలు సాధించేలా అవకాశం కల్పించాలి. తల్లి అయిన తర్వాత కూడా రాణించొచ్చని ఇతర మహిళలకు ఆమె ఒక ఉదాహరణగా నిలుస్తుంది'' అని సాక్షి పేర్కొంది.

# వుదయం సినిమా

## సీఎం విజయ్ మీకు హ్యాట్సాఫ్





## 'వీరభద్రుడు' ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య







## నాని 'ప్యారడైజ్'పై రూమర్లు





## జూన్ 12న "ఆర్ కే దీక్ష"







## 'రాక్షసపురం' సెన్సార్ పూర్తి



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.